మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట





తెలంగాణ పూల జాతరకు వెళ్లెంది. తెలంగాణ ఆడబిడ్డలు ఎంతో సంబురంగా జరుపుకునే పండగ బతుకమ్మ ఈ యేడు వచ్చేసింది. ప్రతి ఏటా భాద్రపద అమావాస్య మొదలు అశ్వియుజ శుక్ల అష్టమి వరకు తొమ్మిది రోజులు బతుకమ్మ పండగ జరుపుకుంటారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు జీవన విధానానికి ప్రతీకగా నిలిచే ఈ పండగ వేళ తొమ్మిది రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా ఎక్కడ చూసినా సందడే కనిపిస్తుంది. ఈ తొమ్మిది రోజుల పాటు మహిళలు రోజుకో విధమైన బతుకమ్మను పేర్చి పండగ సంబరాలు జరుపుకుంటారు. చిన్నా పెద్దా వేడుకలలో పాల్గొంటారు. ముచ్చటగా ముస్తాబై బతుకమ్మలు తయారు చేసి అంతా కలిసి ఆడిపాడతారు.

బిజినేపల్లి,అక్టోబరు 01 ప్రభాతవార్త

## తెలంగాణ పూల పండగ

# బతుకమ్మ..



### బతుకమ్మ వెనుక కథ....

బతుకమ్మ పండగ వెనుక అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. వాటిలో ముఖ్యంగా పేర్కొనే కథ ఇది. ఒక బాలిక భూస్వాముల అకృత్యాలను భరించలేక ఆత్మహత్య చేసుకుంది. అప్పుడు ఆ ఊరి ప్రజలు అందరూ ఆమెను కలకాలం బతుకమ్మా అని దీవించారట. అప్పటి నుంచి ఆ బాలికను కీర్తిస్తూ, గౌరమ్మని పూజిస్తూ స్త్రీలకు సంబంధించిన పండుగగా బతుకమ్మ ప్రాచుర్యం పొందింది. బతుకమ్మ వేడుక సందర్భంగా స్త్రీలందరూ తమకు ఎలాంటి ఆపదలు రాకూడదని, తమ భర్తకు, పిల్లలకు ఎలాంటి ఆపద రాకూడదని గౌరమ్మని వేడుకుంటారు. అలాగే బతుకమ్మ పండగకు సంబంధించి మరో వృత్తాంతం కూడా ప్రచారంలో ఉంది. ఇంకొక వృత్తాంతములో దక్షిణ భారతదేశాన్ని పాలించిన చోళ వంశ చక్రవర్తి ధర్మాంగదుడు సంతానం కోసం పూజలు చేయగా ఆయన భార్య లక్ష్మీదేవి అనుగ్రహముతో ఒక కూతుర్ని కన్నది. ఆమెకు లక్ష్మి అనే పేరు పెట్టారు. పసిబిడ్డ అయిన లక్ష్మి అనేక గండములను ఎదుర్కొంది. అప్పుడు తల్లిదండ్రులు ఆమెకి బతుకమ్మ అని పేరు పెట్టారు. అప్పటి నుండి యువతులు మంచి భర్తను ప్రసాదించాలని కోరుతూ బతుకమ్మను ఆనవాయితీ అయిందట.

### బతుకమ్మ పండగ వివరాలు..

సెప్టెంబర్, అక్టోబర్ నెలలో తెలంగాణలో పండగ వాతావరణం కనిపిస్తూ ఉంటుంది. ఈ మాసంలో తెలంగాణ ప్రాంతం అంతా పండగ కోలాహలంతో కనిపిస్తూ ఉంటుంది. ఈ రెండు నెలల్లో వచ్చే అన్ని పండగులలో బతుకమ్మ పండగకు ఒక విశిష్టమైన స్థానం ఉంది. దసరా పండగకు ఎంత ప్రాధాన్యం ఉందో బతుకమ్మ పండగకు కూడా అంతే ప్రాధాన్యం ఉంది. అయితే బతుకమ్మ పండగ మాత్రం మహిళలకు సంబంధించిన పండగ. వర్షాకాలం ముగుస్తూ, శీతాకాలం ప్రవేశిస్తున్న సమయంలో తెలంగాణ లోని వాతావరణం మొత్తం పచ్చగా ఉంటుంది. ప్రకృతి మాత ఆకుపచ్చ చీరకట్టుకున్నట్లుగా ఉంటుంది. చెరువులన్నీ తాజా నీటితో నిండి ఉంటాయి. అనేక రకాలైన పూలు రకరకాల రంగుల్లో విరబూసి ఆకట్టుకుంటాయి. వీటిలొ గునుగు, తంగేడె పూలు ప్రథమ స్థానంలో నిలుస్తాయి. అలాగే సీతాఫలాలు కూడా విరగ కాసాయి. మొక్కజొన్న పంట కూడా కోతకు సిద్ధమై ఉంటుంది. ప్రకృతి రమణీయతతో పాటు రైతులకు కూడా సంతృప్తికరంగా ఉండే వాతావరణం తెలంగాణ అంతటా ఉంటుంది. ఇలాంటి వాతావరణంలో తెలంగాణ ఆడపడుచులు ప్రకృతి సౌందర్యాన్ని అద్భుతమైన రంగు రంగుల పువ్వులతో కీర్తిస్తూ బతుకమ్మ పండగను వైభవంగా జరుపుకుంటారు.

### బతుకమ్మ అంటే సంబరమే సంబరం...

బతుకమ్మ పండగకు ఒకవారం ముందు నుంచే ఇళ్లల్లో హడావిడి మొదలవుతుంది. బతుకమ్మ పండగ కోసం ఎదురుచూస్తున్న తెలంగాణ ఆడపడుచులు పండగకు వారం రోజుల ముందే పుట్టింటికి చేరుకుని ఆనందోత్సాహాలతో పండగ సన్నాహాలు చేసుకుంటారు. ప్రధాన పండగకు వారం రోజుల ముందు నుంచే తెలంగాణ ఆడపడుచులు చిన్న చిన్న బతుకమ్మలు తయారు చేసి ప్రతిరోజు సాయంత్రం ఆ బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడతారు. ఆ తర్వాత చెరువులో బతుకమ్మని నిమజ్జనం చేస్తారు. బతుకమ్మ పండగ చివరి రోజు జరిగే వేడుకలను, ఆ వైభవాన్ని చూడటానికి రెండు కళ్లూ చాలవు. నయన మనోహరంగా ఉంటుంది ఆ సన్నివేశం. ఆ రోజున పురుషులంతా పచ్చిక బయళ్ళలోకి పోయి తంగేడు,

- మిగతా2లో..



## క్షేత్ర స్థాయిలో ఎల్ఆర్ఎస్ పరిశీలన...

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** ఎల్ఆర్ఎస్ ధరఖాస్తులను వేగవంతంగా పరిశీలించాలని అధికారులను జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. లేఔట్ రెగ్యులరేషన్ స్కీమ్‌లో భాగంగా గతంలో ఎల్ఆర్ఎస్‌కు ధరఖాస్తు చేసుకున్న బండారి జయమ్మ ప్లాటును జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటిలోని కొల్లాపూర్ చౌరస్తా సమీపంలోని సర్వే నెం.73లో ప్లాటు నెంబరు 35లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పంచాయతీ సెక్రటరితో కలిసి పరిశీలించి ఈసీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత ధరఖాస్తులను అధికారులందరు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసిన ధరఖాస్తుల్లో న్యాయబద్ధంగా ఉన్న ధరఖాస్తులను వెంటనే ఆమోదించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ పథకం క్రింద వచ్చిన ధరఖాస్తులు, వాటి ప్రస్తుత స్థితిగతులు, అధికారులు,ఎల్.ఆర్.ఎష్ ప్రక్రియ పూర్తి చేసేందుకు నిర్ధేశించుకున్న ప్రణాళిక మొదలగు వివరాలను న్యాయపరమైన చిక్కులను జాగ్రత్తగా పరిశీలించి ధరఖాస్తుల రెగ్యులరేషన్ ప్రక్రియ కొనసాగించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్పీఓ వరలక్ష్మి, ఏడబ్ల్యూఓ వెంకన్న, ఎంపీఓ భరత్ తదితరులు ఉన్నారు.



ప్లాటును పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

## ఆర్‌యూబీ

# రెడీ..



- నెలాఖరులో ప్రారంభం..? - తొలగనున్న 'గేటు' కష్టాలు..

- రెండు వైపులా పూర్తయిన పనులు

- వర్షపు నీరు వెళ్లేందుకు ప్రత్యేక చర్యలు - జడ్చర్ల ప్రజలకు మోక్షం..

**జడ్చర్ల, అక్టోబరు 01 ప్రభాతవార్త :** దశాబ్దాలుగా జడ్చర్ల ప్రజలు రైల్వే గేటు వల్ల పడుతున్న కష్టాలకు చెక్ పడనున్నది. గేటు పడితే గంటల తరబడి వేచి చేస్తూ ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇక విముక్తి లభించనున్నది చెప్పవచ్చు.

రెండున్నరేండ్ల కిందట గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ) పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. నెలాఖరులోగా ఆర్‌యూబీని ప్రారంభించనున్నట్లు తెలుస్తున్నది. రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు కావడంతో 2022లో రైల్వే గేటు మూతపడిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో జడ్చర్ల వాహనదారులు, ప్రజలు ఇబ్బందుల దృష్ట్యా అప్పటి స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి గౌడ ఫంక్షన్ హాల్ వద్ద అండర్‌పాస్ గుండా



ప్రారంభానికి సిద్ధమౌవుతున్న అండర్‌రైల్వే బిడ్జి

రాకపోకలు సాగించేలా రోడ్డు పనులు పూర్తి చేయించారు. నేటి వరకు కూడా అండర్‌పాస్ గుండా ప్రయాణం సాగిస్తున్నారు. భారీ వాహనాలు మినహా మిగతా కార్లు, ఆటోలు, బైక్‌లు అన్ని నల్లకుంట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. అయితే బ్రిడ్జి పనులు కొనసాగుతున్న దృష్ట్యా భారీ వాహనాలు, ట్రాక్టర్లు సుమారు కిలోమీటరున్నర చుట్టూ తిరిగి సిగ్నల్ గడ్డ మీదుగా నేతాజి చౌక్ వెళ్లాల్సి వస్తున్నది. అదీకాగా జాతీయ రహదారి కావడం, సిగ్నల్ గడ్డ వద్ద రోడ్డు పనులు కొనసాగుతుండడం తో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేకాకుండా రైల్వే గేటు సమస్య కారణంగా కూరగాయలవ్యాపారులు, ఇతర కిరాణ దుకాణాదారులు తాము గత రెండేండ్లుగా నష్టపోతున్నామని వాపోతున్నారు. జడ్చర్ల పట్టణవాసులతోపాటు, ఆలూరు. బూరెడ్డిపల్లి, మల్లేబోయిన్‌పల్లి, ఇతర తండావాసులు, భూత్పూర్ నుంచి జడ్చర్ల వచ్చేవారు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఎట్టకేలకు బ్రిడ్జి పనులు పూర్తి కానుండడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నల్లకుంటలోకి వర్షం నీరు వెళ్లేలా..

రేల్వే అండర్ పాస్‌లోకి చేరే వర్షపు నీరు పైపుల ద్వారా నల్లకుంటలోకి చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈమేరకు ఆర్‌యూబీ నుంచి నల్లకుంటకు సుమారు 265మీటర్ల దూరం ఉందని, ఇప్పటికే 65మీటర్ల పైప్‌లైన్ పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు, మూడు వారాల్లో పనులు పూర్తవుతాయని చెబుతున్నారు. ఈక్రమంలో ఆర్‌యూబీని అక్టోబర్ నెలాఖరులోగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. బ్రిడ్జి ప్రారంభమయితే ముఖ్యంగా నిత్యం ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులకు కూరగాయల మార్కెట్ నిర్వాహకులకు, వాహనదారులకు తిప్పలు తప్పనున్నాయి.

## జిల్లా వ్యాప్తంగా

# 30 పోలీస్ యాక్ట్ అమలు..

- అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు నిషేధం
- సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు
- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట టౌన్,అక్టోబరు 01 ప్రభాతవార్త :** శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా ఈనెల రోజుల పాటు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అను మతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నా, ఫంక్షన్ హాల్లో కార్యక్ర మాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమిగూడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు

## ఒక రాష్ట్రం, ఒక గుర్తింపు

# కార్డు జారికై పైలట్ ప్రాజెక్ట్..

**రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**గద్వాల, అక్టోబర్ 1 ప్రభాతవార్త :** ఒక రాష్ట్రం ఒక గుర్తింపు కార్డు జారీకై పైలట్ ప్రజెక్టు కింద ప్రతి నియోజకవర్గం నుండి ఒక గ్రామ పంచాయతీ,ఒకమున్సి పల్ వార్డులో కుటుంబ సభ్యుల వివరాల సేకరణ చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం హైదారాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబానికి ఒకగుర్తింపు నెంబరు ఇచ్చి కుటుంబంలోని సభ్యులకు వ్యక్తిగత గుర్తింపు నెండరుతో కార్డు జారి చేయాల్సి ఉంటుందన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు పకడ్బందీగా సేకరించి తప్పులు లేకుండా నిర్ణీత ప్రోఫార్మాలో వివరాలు నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 3 నుండి 8వ తేది వరకు వివరాల సేకరణ పూర్తి చేసిన అక్టోబర్ 10న నివేదిక పంపించాల్సిందిగా సూచించారు. కుటుంబ సభ్యుల వివరాలు నమోదే ప్రక్రియను పవార్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆర్డీఓ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలని, పైలెట్ ప్రాజెక్టు పూర్తి అయ్యాక రాష్ట్రంలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తికి ఒక గుర్తింపు కార్డు జారీ చేసేందుకు కార్యాచరణ చేపట్టడం జరుగుతుందన్నారు. కుటుంబంలో పెద్ద వయస్సు కలిగిన మహిళను కుటుంబ యజమానిగా గుర్తించాల్సి ఉంటుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మాట్లాడుతూ ప్రతి జిల్లా నుండి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటుచేసి నివేదికను గురువారం లోపు పంపించాలని ఆదేశించారు.ఎల్.ఆర్.ఎస్ పై సమీక్ష నిర్వహిస్తూ, ఇప్పటివరకు 5శాతం పూర్తి కాలేదని,ఎల్.ఆర్.ఎస్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.నిబంధనల మేరకు ఉన్న లేఔట్లు,ప్లాట్లను త్వరగా రెగ్యులరైజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. సన్న బియ్యం, గొడ్డు బియ్యం కొనుగోలుకు వేరువేరుగా కేంద్రాలను ఏర్పాటుచేసి సన్న బియ్యానికి 500/- రూపాయలు అదనంగా అందించే విధంగా చర్య చేపట్టాలన్నారు. కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అదనపు కలెక్టరు లక్ష్మీ నారాయణ , నర్సింగ రావు, భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస రావు, ఆర్డీఓ రామచందర్, డిపిఓ శ్యాంసుందర్, అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్స్ రామచందర్, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులను ఆదరిద్దాం..

- వారి ఆరోగ్య సంరక్షణ కుటుంబ బాధ్యత
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి
- ఐడిఓసిలో ఘనంగా వృద్ధుల దినోత్సవం



వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 01 ప్రభాతవార్త :** వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమంతో పాటు వారిని ఆదరించడం కుటుంబ సభ్యుల బాధ్యత అని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా శిశు, వయో వృద్ధుల దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధాప్యం రెండో బాల్యం లాంటిదని, పిల్లలతో సమానంగా వయో వృద్ధులను కూడా కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. వయో వృద్ధులను, తల్లిదండ్రులను కుటుంబ సభ్యులు జాగ్రత్తగా చూసుకోవాలని అన్నారు. వయో వృద్ధులను, తల్లిదండ్రులను కుటుంబ సభ్యులు ఏ విధంగా చూసుకుంటారో పిల్లలు కూడా రోల్ మోడల్‌గా తీసుకుంటాంన్నారు. ఉద్యోగ, వ్యాపార ఇంటి బాధ్య తలతో వృద్ధులైన తల్లిదండ్రులతో సరిగా మాట్లాడలేక పోవడం వారికి లోటుగా అనిపిస్తుందని, వారితో ప్రేమగా మాట్లాడి ఆదరించాలన్నారు. రిటైర్మెంట్ తర్వాత సెకండ్ లైఫ్ మొదలవుతుందని వయో వృద్ధులను సంరక్షణ ప్రభుత్వంతో పాటు వయో వృద్ధుల ఫోరంలు సహకారం

-మిగతా2లో..

## కేసీఆర్‌ది నిర్మాణాల చరిత్ర...

# రేవంత్‌రెడ్డిది కూల్చివేతల చరిత్ర...

- ప్రజల దృష్టిని మళ్లించడానికి హైడ్రా...
- ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక డైవర్షన్... అటెన్షన్...
- బీఆర్ఎస్ కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్
- డీఎస్పీ, ఎస్ఐలు జాగ్రత్త: మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,అక్టోబర్01 ప్రభాతవార్త:** తెలంగాణలోని కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చడానికి సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా పేరుతో ప్రజల దృష్టిని మళ్లీస్తున్నారని నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యూపీ బుల్డోజర్లు హైదరాబాద్‌కు వచ్చాయని ఆయన ఆరోపించారు. ఎన్నికలకు ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కార్ ఇందిరమ్మ రాజ్యం తెస్తాం... పెన్షన్లను రెండింతలు చేస్తాం. రైతు భరోసాను రెట్టింపు చేస్తామని రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని అనేక ప్రగల్భాలు పలికి తీరా ప్రజలు ఓట్లు వేశాక ఆ పేదల ఇండ్లను కూల్చి వేస్తున్నారని దుయ్యబట్టారు. 60వేల కోట్లతో మూసీ నది ప్రక్షాళన చేపడుతామన్న రేవంత్ సర్కార్ 1500కోట్లను అడ్డదారిన సొమ్ము చేసుకోవాలని ప్రణాళిక రూపొందించి చేస్తున్న పనిగా హైడ్రాను అభివర్ణించారు. సూట్‌కేసులు ఇచ్చిన వారి పెద్ద పెద్ద భవంతులను కూల్చకుండా పేదలను టార్గెట్‌చేసి వారిఇండ్లను కూలగొడుతున్నారని ఆరోపించారు. 9నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ అనేక విమర్శలు, తప్పుడు పనులను మూటగట్టుకొని ఎలా ముందుకు సాగుతారని ఆయన ప్రశ్నించారు. తన 30 ఏళ్ల అనుభవంలో సీఎంను మొదటి సారి విమర్శించడం మొదటి సారి చూస్తున్నానని ఆయన తెలిపారు. పేదల పక్షాన నిలిచిన హరీష్‌రావు, కేటీఆర్‌లపై రాళ్ల దాడులు, కాంగ్రెస్ మూకలతో దాడులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. హైడ్రా పేరుతో కమర్షియల్ డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

### నాగర్‌కర్నూల్‌లో తండ్రి

### కొడుకుల కక్ష్య సాధింపు రాజకీయాలు..

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో తండ్రి కొడుకుల కక్ష్య సాధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారని పరోక్షంగా ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డిలపై మాజీ ఎమ్మెల్యే తీవ్రంగా మండిపడ్డారు. వినాయక చవితి పర్వదిన సమయాల్లో 50మంది యువకులు ఉంటే కేవలం బీఆర్ఎస్ కార్యకర్త అయిన పాలమూరు శివపై మాత్రమే కేసు పెట్టి రిమాండ్‌కు తరలించడం ఎంత వరకు సమంజసమన్నారు. 9 నెలలో కాలంలో తండ్రి కొడుకులు 9 మందిని జైలుకు పంపడం తప్ప వారు చేసిన అభివృద్ధి పనులేమి లేవన్నారు. 9 నెలల కాలంలో ప్రాజెక్టులు, ఇతర పనుల కోసం 9 తట్టెల మన్నును సైతం తీయలేదన్నారు. తాను పూర్తి చేసిన పనులకు తండ్రి కొడుకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభిస్తున్నారని ఆయన విమర్శించారు.

### పోలీసులు తస్మత్ జాగ్రత్త...

నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి విమర్శించారు. మీ ఒంటిపై ఉన్నది ఖాకీ డ్రస్

- మిగతా2లో..

# అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

## - సంప్రదాయరీతిలో బతుకమ్మలకు పూజలు

**దేవరకద్ర,అక్టోబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర,కౌకుంట్ల మండలాలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.ప్రతి ఏడాది మండలల్లోని ఆయా గ్రామాలలో బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తారు.అందులో భాగంగానే ఈ ఏడాది కూడ బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు.దేవరకద్ర మండలంలోని డోకూర్ తపోవన్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించి విద్యార్థులు వివిధ సంస్రృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఆటపాటలతో సందడి చేశారు.దీంతో పాఠశాల ఆవరణ బతుకమ్మల సందడితో హోరెత్తిపోయింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ వర్కుటి నిరంజన్‌రెడ్డి,ఉపాధ్యాయులు చంద్రయ్య,నరసింహ్మలు, పావని,అనురాద,స్వప్న,కల్యాణి,సబిహ,రీతు,అనిత,కవీస్,భార్గవి,మౌనిక తదితరులు పాల్గొన్నారు.

**ఆయా గ్రామాలలోని పాఠశాలలో..**

దేవరకద్ర మండలంలోని ఆయా గ్రామాలలోని వివిధ పాఠశాలతో మంగళవారం బతుకమ్మ సంబరా లను ఘనంగా నిర్వహించారు. వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించి విద్యార్థులు వివిధ సంస్రృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఆటపాటలతో సందడి చేశారు.బోడ్డెమ్మలు వేశారు.దీంతో ఆయా పాఠశాలలు బతుకమ్మల సందడితో కనిపించాయి.ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్ర మండలం తపోవన్ పాఠశాలలో బతుకమ్మలను తీసుకవస్తున్న విద్యార్థులు

**స్విట్స్‌లో ఘనంగా బతుకమ్మ సంబరం**

దేవరకద్ర మండలం చౌదన్‌పల్లి స్విట్స్ ఇంజనీర్ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాన్ని ఘనంగా నిర్వహించారు.ప్రతి ఏడాది కళాశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ ఏడాది కూడ ఈ సంబరాలను సాంప్రదాయ రీతిలో నిర్వహించారు.ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వివిధ పూలతో శోభాయమానంగా అలంకరించిన బతుకమ్మలకు పూజలు నిర్వహించి విద్యార్థులు వివిధ సంస్రృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఆటపాటలతో సందడి చేశారు.దీంతో కళాశాల ఆవరణ బతుకమ్మల సందడితో హోరెత్తిపోయింది.బతుకమ్మలను పేర్చిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు.దాదాపు 200 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డీన్ కే.సుధాకర్,ప్రిన్స్‌పాల్ పి.సుధాకర్,జయంతి ఎడ్యూకేషన్ సొసైటి అధ్యక్షుడు బాలీశ్వర్,ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి,కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి,కోశాధికారి సూర్యనారాయణలతో పాటు కళాశాల ఆధ్యాపక బృందం సభ్యులు,ఆయా విభాగా అధిపతులు,విధ్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



స్విట్స్ కళాశాలలో బతుకమ్మలతో అధ్యాపక బృందం,విద్యార్థులు

# నేడు పెద్ద రేవల్లిలో గాంధీ విగ్రహావిష్కరణ

**హాజరు కానున్న డీఈఓ రవిందర్, టిపి ఆర్‌టియు వ్యవస్థాపక అధ్యక్షులు హర్షవర్ధన్‌రెడ్డి**

**బాలానగర్,అక్టోబరు 01 ప్రభాతవార్త :** బాలా నగర్ మండలంలోని జడ్పీహెచ్ఎస్ ఎదురుగా గాంధీజీ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు పాఠశాల ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం కందే వసుంధర వెంకటేశ్వర్లు తెలిపారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామంలో గాంధీజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే సంకల్పంతో తన సొంత నిధులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు,యువకుల సహకారంతో విగ్రహాన్ని విజయవంతంగా ఏర్పాటు చేసుకున్నట్లు పేర్కొన్నారు. బుధవారం గాంధీజీ విగ్రహావిష్కరణకు ముఖ్య అతిథులుగా మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి రవిందర్, టిపిఆర్‌టియు వ్యవస్థాపక అధ్యక్షులు, టిపిసిసి స్పోర్ట్స్ పర్సన్ గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి హాజరు కానున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే పాఠశాల ఆవరణలో సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేయించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.



ఆవిష్కరణకు సిద్ధమైన గాంధీజీ విగ్రహం

# ఉపకార వేతనాలకు దరఖాస్తు చేసుకోండి

**గద్వాల , అక్టోబర్ 1 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా యందు 2024-25 విద్యా సంవత్సరం గాను పోస్టు మెట్రిక్ ఉపకార వేతనములకు అర్హులైన ఎస్సీ విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ కులాల అభివృద్ధి అధికారి డి.సరోజ ఒక ప్రకటనలో తెలిపారు. ఉపకార వేతనాలకు ఆదాయ పరిమితి రూ.2,00,000 నుండి 2,50,000 పెంచినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు అనుగుణంగా నూతన విధివిధానాలను ఈ పాస్ వెబ్సైట్ నందు మార్పు చేసినట్లు తెలిపారు. మొదటగా విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్ నందు ఎస్ఎస్సి, ఆధార్‌కార్డు వివరాలతో తాత్కాలిక ఈపాస్ ఐడి 12 అంకెలతో ఇవ్వబడుతుందని, ఎస్ఎస్సి మెమోలో ఉన్న వివరాలు ఆధార్ వివరాలకు సరిగ్గా లేని పిదప దగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాల్లో ఆధార్ వివరాలు సరి చేసుకోవాలని అన్నారు. తదుపరి ఈ పాస్ ఐడి నెంబర్‌తో దగ్గరలోని మీసేవ కేంద్రం వద్ద బయోమెట్రిక్ వేయవలసి ఉంటుందని, బయోమెట్రిక్ అనంతరం విద్యార్థి ఇంటర్నెట్ సెంటర్ ను సంప్రదించి పూర్తిస్థాయిలో నమోదు పూర్తి చేసి తర్వాత సంబంధిత కళాశాలలో సమర్పించాలని ఈ విషయాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాల ప్రిన్సిపాల్ మరియు యాజమాన్య ప్రతినిధులు తమ విద్యార్థులకు నమోదు ప్రక్రియ పైన అవగాహన కల్పించాలని ఆమె కోరారు.

# బిసిలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలి

**పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు వినతి పత్రం సమర్పించిన బిసి ఐక్యవేదిక**

**మక్తల్,అక్టోబరు 01 ప్రభాతవార్త :** త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42% రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయడంతో పాటు బిసిల కులగణన చేపట్టాలని బిసి ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులుగౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గ కేంద్రంలో మహాత్మా జ్యోతిభా పూలే బిసి భవన్‌కు 3 ఎకరాల స్థలాన్ని కేటాయించి బిసి భవన్ నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడ్జెట్‌లో బిసి కార్పోరేషన్‌కు రూ. 2 వేల కోట్లను కేటాయించి బిసిలు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో బిసి ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జి. రంగప్ప యాదవ్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షులు కె.రాజు, ప్రధాన కార్యదర్శి ఎం. లింగంగౌడ్ తదితరులు ఉన్నారు.

# పరిశుభ్రతపై దృష్టి సారించండి మున్సిపల్ చైర్‌పర్సన్

**ఆత్మకూర్ అక్టోబర్ 01 ప్రభాతవార్త :** నిత్యజీవితంలో భాగంగా పరిశుభ్రతపై ప్రతి ఒక్కరు దృష్టి సారించాలని ఆత్మకూర్ మున్సిపల్ చైర్పర్సన్ గాయత్రి రవికుమార్ యాదవ్ అన్నారు. మంగళవారం రోజు ఆత్మకూరు పట్టణంలోని నాలుగో వార్డులో కమిషనర్‌తో కలిసి చైర్పర్సన్ కలియ తిరుగుతూ అంటువ్యాధుల నివారణ కోసం ప్రతి ఒక్కరు సహకరించాలని పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కాలనీలోని మురుగునీటిని తొలగించేందుకు మున్సిపల్ సిబ్బంది చేస్తున్న ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. నాలుగో వార్డులో ఇటీవల కురిసిన వర్షాలకు అక్కడక్కడ మురుగునీరు చేరి దుర్గంధం వ్యాపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేకంగా బ్లీచింగ్ పౌడర్ పిచికారి చేయించారు. అంతేకాకుండా కాలనీలో నిలవనీటిని ప్రత్యేకంగా ఇండ్లలోకి వెళ్లి పారబోయించారు. మున్సిపల్ కేంద్రంలో అంటువ్యాధుల నివారణ కోసం మున్సిపల్ సిబ్బంది చేస్తున్న ప్రయాత్నాలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ నాగరాజు ,,వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మహేశ్వరి ,అశ్విని, కుమార్, రామకృష్ణ ,తబసుం బేగం తదితరులతో పాటుగా ప్రభుత్వ ఆయా శాఖలకు చెందిన అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ప్రజలకు వ్యాధులపై చైతన్యం నింపిన కళాకారులు

**ఇటిక్యాల అక్టోబర్ 1 ప్రభాతవార్త :** ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉండాలని సాంస్కృతిక కళాకారులు ఆటపాట ద్వారా ఇటిక్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రజలకు వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ బిఎం.సంతోష్ సారథ్యంలో జిల్లా సమాచార శాఖ అధికారి డీపీఆర్వో నేతృత్వంలో మంగళవారం జిల్లా సాంస్కృతిక సారథి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు జిల్లా సాంస్కృతిక సారథి కళాకారులు పలు అంశాలపై ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం వాతావరణ దృష్ట్యా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా జిల్లా ప్రజలు ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అనారోగ్యానికి గురి కాకుండా ఉండాలని ప్రజా క్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా భావిస్తూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అదే విధంగా జిల్లా పోలీస్ యంత్రాంగం చేపడుతున్న మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టేందుకు సైబర్ నేరాలు , రోడ్డు ప్రమాద నివారణకు హెల్మెట్ రక్షణ, అక్షరాస్యత, మూఢనమ్మకాల నిర్మూలన , బాల్యవివాహాలు తదితర అంశాలపై జిల్లా సంస్కృతిక సారథి కళాకారులు కళ్లకు కట్టినట్లు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సాంస్కృతిక కళాకారులు ప్రజలకు చైతన్యం నింపుతున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంస్కృతిక సారథి కళాకారులు కేశవులు, భూపతి నాయుడు, కృష్ణ, కవిత, మండల వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు, వెంకటేశ్వర్లు , చంద్రనాగమ్మ, ఎఎన్ఎం లు ఆశాకార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# 20 లక్షల ప్రమాద బీమా చెక్కు బాధిత కుటుంబానికి అందజేత...

**ఇటిక్యాల అక్టోబర్ 1, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ని వల్లూరు గ్రామానికి చెందిన వై.మురళిమోహన్ రెడ్డి బ్యాంకు తన ఖాతా ద్వారా సంవత్సరానికి వెయ్యి రూపాయల చొప్పున ఇన్సూరెన్సు చేయించుకోగా ప్రమాదవశాత్తు ఆయన మృతి చెందగా నామిని అయిన ఆయన తండ్రి వై.రామిరెడ్డి కి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ వారణాసి రంజిత్ మరియు సీనియర్ మేనేజర్ రాఘవేంద్ర రెడ్డి చేతుల మీదుగా 20 లక్షల ప్రమాద బీమా చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. అదే విధంగా వల్లూరు గ్రామంలో నాబార్డు వారి ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత పై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ రంజిత్ మాట్లాడుతూ వై.మురళిమోహన్ రెడ్డి, తన బ్యాంకు ఖాతాలో సంవత్సరానికి వెయ్యి రూపాయలు ఎస్బిఐ జనరల్ ఇన్సూరెన్సు పొందడానికి ఆస్కారం ఉందన్నారు. అలాగే బ్యాంకు ద్వారా అందించే వివిధ రకాల సేవలు సౌకర్యాల గురంచి గ్రామ ప్రజలకు వివరించారు. మొబైల్ బ్యాంకింగు, ఇంటర్నెట్ బ్యాంకింగు, ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. అలాగే బ్యాంకులో తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించాలని ఏటీఎం కార్డు రూపే కార్డులను వాడి సమయం ఆదా చేసుకోవాలన్నారు. అంతేకాక మోసపూరిత ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని ఇతరులకు మన యొక్క సమాచారాన్ని మరియు వివరాలను చెప్పకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎల్సి కౌన్సిలర్ సురేశ్ రెడ్డి, బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ సాయికుమార్, ఎస్బిఐ జనరల్ బిడియం నరేశ్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ మధు కృష్ణ, రవిసాగర్, బ్యాంకు మిత్రులు, కళాజాత బృందం మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



బీమా చెక్కును అందిస్తున్న బ్యాంకు అధికారులు

# తెలంగాణ పూల పండగ బతుకమ్మ..

మొదటి పేజీ తరువాయి భాగం..

గునుగు, కలువ పూలను కోసుకుని వస్తారు. ఆ తర్వాత ఇంట్లో అందరూ గునుగు, తంగేడు, కలువ పువ్వుల్ని మరికొన్ని పువ్వుల్ని కలిపి బతుకమ్మను తయారు చేస్తారు. బతుకమ్మలో మిగతా ఎన్నిపూలు ఉన్నా గునుగు పూలు, తంగేడు పూలదే ఆధిపత్యం ఉంటుంది.

**బతుకమ్మ చేసే విధానం...**

గునుగు, తంగేడు పూలతో పాటు మిగతా పూలు ఒకరాగి పళ్లెంలో వలయాకారంగా పేర్చుకుంటూ వస్తారు. ఒక రంగు పువ్వు తర్వాత మరో రంగు పువ్వును పేరుస్తూ ఆకర్షణీయంగా ఉండే విధంగా బతుకమ్మను తయారు చేస్తారు. ఆ తర్వాత తంగేడు పువ్వులను కట్టగా కట్టి వాటిమీద పేర్చుతారు. మధ్యలో రకరకాల పూలను ఉపయోగిస్తారు. ఈ పూల అమరిక ఎంత పెద్దగా ఉంటే బతుకమ్మ అంత పెద్దగా,అ ంత అందంగా రూపొందుతుంది. పూలను చక్కగా పేర్చడం పూర్తయిన తర్వాత బతుకమ్మ మీద పసుపుతో చేసిన గౌరీమాతను పెట్టి చుట్టూ దీపాలతో అలంకరిస్తారు. ఇలా తయారు చేసిన బతుకమ్మను ఇంట్లోని పూజా గదిలో అమర్చి పూజిస్తారు. ఆ తర్వాత బతుకమ్మని బయటికి తీసుకువచ్చి ఆడపడుచులు బతుకమ్మ చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరీదేవిని కీర్తిస్తూ పాటలు పాడతారు. ఆడపడుచులు కొత్త బట్టలు కట్టుకుని, వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను ధరిస్తారు. ఇలా చాలాసేపు ఆడాకు మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. తరువాత ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం, మొక్కజొన్నలు లేదా వేరుశనగ లేదా పెసర విత్తనాలను దోరగా వేయించి పిండి చేసి బెల్లం లేదా పంచదార కలిపిన సత్తుపిండి ఒకరికొకరు ఇచ్చి పుచ్చుకుని ప్రసాదంలా స్వీకరిస్తారు. బతుకమ్మ వేడుకల చివరిరోజు సాయంత్రం ఆడపడుచులు అందరూ చక్కగా దుస్తులు, ఆభరణాలు ధరించి బతుకమ్మను వాకిలిలో పెడతారు. చుట్టుపక్కల ఉన్నవారు కూడా వారి బతుకమ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టు పెద్ద వలయాకారంలో చేరతారు. ఐక్యత, ప్రేమతో మానవహారంలా బతుకమ్మ చుట్టు తిరుగుతూ పాటలు పాడతారు. ఒకరు ముందుగా పాట మొదలు పెడితే మిగిలిన వారు వారితో గొంతు కలుపుతూ పాడతారు. ఈ జానపద గీతాలు ప్రత్యేకమైన తెలంగాణా సంస్కృతిని ఆవిష్కరిస్తాయి. చీకటి పడే వేళకి ఆడపడుచులందరూ బతుకమ్మలను తలపై పెట్టుకుని పెద్ద చెరువు గానీ, తటాకం వైపుగాని ఊరేగింపుగా వెళ్తారు. ఈ ఊరేగింపు అందంగా అలకరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో, వాయిద్యాలతో కన్నుల పండుగగా ఉంటుంది. జలాశయం చేరుకున్న మహిళలు బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడతూ, పాడుతూ నీటిలో జారవిడుస్తారు. ఆ తరువాత చక్కెర, రొట్టెతో చేసిన మలీద అనే వంటకాన్ని బంధువులకు పంచిపెట్టి తింటారు. ఆ తర్వాత ఖాళీ పళ్లెం (తాంబళం)తో ఇంటికి చేరతారు.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను

# త్వరగా పూర్తి చేయాలి:జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల,అక్టోబర్ 1 ప్రభాతవార్త:** ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం పట్టణ శివారులో నిర్మిస్తున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను జిల్లా కలెక్టర్ పరిశీలించా రు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న పనులు వాటి పురోగతిపై వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా కళాశాల వసతులను అనుగుణంగా జిప్లస్ వన్ నిర్మాణం పూర్తి చేయాలని, తరగతి గదులు, ల్యాబ్‌లు మొదలైన విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రాజెక్టు మ్యాప్ ద్వారా ప్రాజెక్టు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. పనులు అన్ని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం, నిర్దిష్ట అధికారులను ఆదేశించారు. అంతకుముందు పాత ఎస్పీ కార్యాలయం, గంజిపేటలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నర్సింగ్ కళాశాలను సందర్శించి అన్ని తరగతులు, ల్యాబ్‌లు పరిశీలించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కళాశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారని, ద్వితీయ మరియు తృతీయ సంవత్సరాల విద్యార్థులు పాత ఎస్పీ కార్యాలయంలో ఉంటుండగా, మొదటి సంవత్సరం విద్యార్థులు గంజిపేటలో ఉంటున్నారని ప్రిన్సిపాల్ వివరించారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించి వారికి మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రిన్సిపాల్ సిబ్బందికి అవసరమైన మార్గదర్శకాలను వివరించారు. కొత్త ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నిర్మాణం కొద్ది నెలల్లో పూర్తవుతుందని, అప్పటి వరకు కొత్త బ్యాచ్ నర్సింగ్ విద్యార్థులకు గంజిపేటలో తాత్కాలిక సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, నిర్మాణం పూర్తయ్యక అన్ని మౌలిక వసతులతో కూడిన కొత్త ప్రాంగణాన్ని విద్యార్థులను తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతమ్మ, టిజిఎంఎస్ఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జైపాల్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజర్ సురేశ్, ఏఈ రహీముద్దిన్, కళాశాల సిబ్బంది, అధికారులు, తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ నర్సింగ్ కళాశాల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

# వృద్ధులను ఆదరిద్దాం:కలెక్టర్ విజయేంద్రబోయి

మొదటి పేజీ తరువాయి భాగం..

ముఖ్యమని ఆమె అన్నారు. వయోవృద్ధులు కుటుంబ సభ్యుల నుండి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ సంరక్షణకు ఆర్‌డిఓ ట్రిబ్యునల్‌ను సంప్రదించాలని అన్నారు. ఆర్‌డిఓ ట్రిబ్యునల్ వద్ద న్యాయం లభించకపోతే జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవాలని అన్నారు. వయోవృద్ధుల ఆస్తులను, భూములను పిల్లలు బలవంతంగా తమ పేరు రాసుకోవడం వారి బాగోగులను పట్టించుకోవడం లాంటి సంఘటనలు జరుగుతున్నాయని, వయోవృద్ధులు మోసపోకుండా తమ ఆస్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని అన్నారు. మండల స్థాయిలో సీనియర్ సిటిజన్ ఫోరంలు ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించి అవగాహన కలిగిస్తున్నట్లు తెలిపారు. వెల్‌నెస్ సెంటర్‌ను వయో వృద్ధుల సంక్షేమ ఫోరం సభ్యులు కోరిన విధంగా వారికి అనుకూలంగా ఉండే విధంగా పరిశీలించి ఏర్పాటుకు తగిన నిర్ణయం తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి గురువారం ప్రభుత్వ ఆసుపత్రులు, పిహెచ్‌సిలలో వయో వృద్ధుల హెల్త్ చెకప్ వైద్యారోగ్య శాఖ చర్యలు తీసుకుంటుందని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం తరపున వయో వృద్ధుల ఆరోగ్య సంరక్షణకు హెల్త్ క్యాంపులు, గ్రాండ్ పేరెంట్స్ డేను పాఠశాలలు, అంగన్‌వాడి కేంద్రాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మోహన్‌రావు మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణకు ఆర్‌డిఓ ట్రిబ్యునల్, అప్పీల్‌కు కలెక్టర్‌కు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. అదనపు ఎస్పీ రాములు మాట్లాడుతూ వయో వృద్ధుల సంరక్షణకు పోలీస్ శాఖ తరపున అండగా ఉంటామని, వారికి భద్రతా పరంగా ఏ సమస్య ఎదురైనా 100కు ఫోన్ చేస్తే పోలీస్ శాఖ తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆస్తులు, భూముల పట్ల మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వయో వృద్ధుల సంక్షేమ సంఘం సభ్యులు మాట్లాడుతూ వెల్‌నెస్ సెంటర్ ప్రస్తుతం పై ఫ్లోర్‌లో ఉన్న పాత జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఉందని, లిఫ్ట్ సౌకర్యం లేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని అక్కడి నుండి డీఈఓ కార్యాలయానికి తరలించాలని అన్నారు. సమావేశం అనంతరం ఉత్తమ సేవలు అందించిన పది మంది వృద్ధులను జిల్లా కలెక్టర్ ఘనంగా సన్మానించారు. సమావేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డా.పద్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి జరీనా, డిఆర్‌డిఓ నర్సింహులు, పశు వైద్యశాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదన్, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షులు జగపతిరావు, కార్యదర్శి నాగభూషణం, పెన్షనర్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిగౌడ్, వయోవృద్ధుల ట్రిబ్యునల్ సభ్యులు నాగేంద్రస్వామి, జడ్చర్ల సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ ఫోరం నయీమొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతంగా ముగిసిన ఉచిత వైద్య శిబిరం

**పెబ్బేరు అక్టోబర్ 01 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో మాంటిస్లోరి ప్లే స్కూల్లో గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ అనుబంధ (బాలల సంక్షేమ) సంస్థ అయిన జవహర్ బాల్ మంచ్ వనపర్తి జిల్లా కమిటీ చీఫ్ కో ఆర్డినేటర్ సూగూర్ శివ ఆధ్వర్యంలో, శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్, డాక్టర్ రాఘవేందర్ రెడడ్డి వారి సహకారంతో, మాంటిస్సోరి ప్లేవే స్కూల్ నందు నిర్వహించిన బాలల ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.కార్యక్రమానికి సహకరించిన డాక్టర్ రాఘవేందర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ రాజేందర్ గౌడ్ ఉపాధ్యాయ బృందానికి, కార్యక్రమాన్ని సదర్శించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలకు, నాయకులకు, కార్యక్రమానికి మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదీని రెడ్డి, వైస్ చైర్మన్ విజయవవర్ధన్ రెడ్డి, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్. పట్టణ అధ్యక్షులు కార్వాకుల వెంకట రాముల, యుగేంధర్ రెడ్డి, పాతపల్లి చంద్రశేఖర్, గుర్రంగడ్డ రాజు, శంకర్ నాయుడు, రమేష్, మిద్ద శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్‌ది నిర్మాణాల చరిత్ర...

# రేవంత్‌రెడ్డిది కూల్చివేతల చరిత్ర...

మొదటి పేజీ తరువాయి భాగం..

అని,కాంగ్రెస్ 3రంగుల జెండాకాదని ఆయన హితవు పలికారు. అధికారం ఉందని ఆ పార్టీ నాయకుల అండదండలు చూసుకొని తమ పార్టీ కార్యకర్తలపై రెచ్చిపోతే భవిష్యత్తులో మీరు ఈ జిల్లా, రాష్ట్రంలో పనిచేసేది లేదన్న విషయాన్ని గుర్తించుకొని విధులు నిర్వహించాలన్నారు. అనేక మంది కార్యకర్తలపై కక్ష్య సాధింపుగా వ్యవహరిస్తూ అక్రమంగా కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా గ్రామాల్లో తండ్రికొడుకొలు తిరిగే ప్రసక్తే లేదన్నారు. విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు అర్ధం రవి, పులిందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటయ్య, వనపట్ల సుబ్బారెడ్డి, నాగయ్య, బాలయ్య తదితరులు ఉన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడిని కలిసిన

# టిఎస్ టిపిసిసి మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప

**మక్తల్,అక్టోబరు01 ప్రభాతవార్త:** తెలంగాణ పిసిసి అధ్యక్షుడిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను టిఎస్ టిపిసి మాజీచైర్మన్ దేవరిమల్లప్ప మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్ నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసు కోవాలని టిపిసిసి అధ్యక్షుడికి విన్నవించినట్లు మల్లప్ప తెలిపారు.

# రూ.1860 ధర పలికిన హంస

**దేవరకద్ర,అక్టోబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు 27 కింటాళ్ళ హంస ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.1860 ధర పలికింది.అతి తక్కువగా కూడ అంతే ధర పలికింది.అలాగే 5 కింటాళ్ళ ఆముదాలను రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్ ధాన్యానికి రూ.5973 ధర పలికింది.అలాగే అతి తక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

# డిఎస్సి ఉద్యోగులకు ఘన సన్మానం

**కొత్తకోట అక్టోంబర్ 01 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన డిఎస్సి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి ఉద్యోగాలు పొందిన మానస బిఈడి కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ బాలనారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. బుధవారం కళాశాలలో వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి సంబంధించిన బిఈడి చేసిన మా కళాశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ బాలనారాయణ అన్నారు. సుమారు మా కళాశాలకు చెందిన వారే 15 మందికి డిఎస్సి ఉద్యోగాలు వచ్చాయని సంతోషం వ్యక్తం చేశారు. మా కళాశాలలో చదివిన వారికి ఉద్యోగాలు రావడం మాకు గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# 50క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**రైస్ మిల్ యజమానిపై కేసు నమోదు**

**ఇటిక్యాల అక్టోబర్ 1 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జింకలపల్లి గ్రామ శివారులోని పద్మావతి శ్రీనివాస్ రైస్ మిల్లులో అనుమతులు లేకుండా అక్రమంగా నిలువ చేసుకున్నట్లు సమాచారం ఉండటంతో మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో సివిల్ సప్లై ఎన్ ఫోర్స్ మెంట్ అధికారి మహశ్రీ పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీ చేశారు. తనిఖీలో రైస్ మిల్లులో అక్రమంగా నిలువ ఉన్న బియ్యాన్ని పరిశీలించగా పిడిఎస్ బియ్యం 108 సంచులు ఉండగా మొత్తం 50 క్వింటాల్ బియ్యం స్వాధీనం చేసుకోవడం జరిగిందని సివిల్ సప్లై ఎన్ ఫోర్స్‌మెంటు అధికారి ఫిర్యాదు మేరకు రైస్ మిల్లు యజమాని చల్లా ప్రకాశ్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

## పెబ్బేర్ మార్కెట్ యార్డును

# సందర్శించిన డిసిసిబి చైర్మన్

**పెబ్బేరు అక్టోబర్ 01 ప్రభాతవార్త :** పెబ్బేర్ మార్కెట్ యార్డ్‌ను మంగళవారం డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి డిసిసిబి డైరెక్టర్ ఈర్లదిన్నె రంగారెడ్డి సందర్శించి నూతనంగా ఎన్నికైన పాలకమండలితో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ గౌని ప్రమోదిని పాండేశ్వరి రెడ్డి, వైస్‌చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, డిసిసిబి చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డిని,డైరెక్టర్ రంగారెడ్డి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, యుగేంధర్ రెడ్డి, పాతపల్లి చంద్రశేఖర్, రాముడు, గుడిసె రమేష్, ఎం.డి జాంగిర్ మిద్దె శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

**పెబ్బేర్‌లో డిసిసిబి బ్యాంక్ ఏర్పాటు చేస్తాం**

వనపర్తి ఎమ్మెల్యే తూడిమేఘారెడ్డి కోరిక మేరకు పెబ్బేర్‌లో డిసిసిబి బ్యాంకు ఏర్పాటు చేయడానికి మామిళ్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి బ్యాంకు చైర్మన్ ద్వారా ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఈ బ్యాంకు రావడానికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కృషి చేసినందుకు పెబ్బేరు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

## విద్యార్థులకు షీ టీమ్ పోలీసుల అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 01 ప్రభాత వార్త:** మహిళలు, విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని షీటీం పోలీసులు తెలిపారు. అపరిచిత వ్యక్తుల పట్ల ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన టీ సేఫ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయచ్చని షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని బ్రిలియంట్ పాఠశాలలో విద్యార్థులకు అపరిచిత వ్యక్తుల నుండి అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్,సెల్‌ఫోన్ అధిక వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, అమ్మాయిల వేధింపులకు గురైతే ఏం చేయాలి, బాల్య వివాహాలు, రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ చట్టాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.బాలికలు ఎక్కువగా తెలిసిన వారితోనే వేధింపులకు గురవుతారని అలాంటి వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని, ధైర్యంగా ఉండి షీ టీమ్ పోలీసులకు సెల్ నం. 8712 670398కి లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం పోలీసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## టిజిఎస్ఎస్‌కు ఎంపికైన విద్యార్థినీలు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

**కొత్తకోట అక్టోబర్ 01 ప్రభాతవార్త:** మదనాపురం మండలంలోని దుప్పల్లి గ్రామ భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినీలు పల్లెపాగ శ్రావ్య,అక్కల శ్రీనిజ తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికయ్యారు.మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ ఎండి ఖాజా మైనద్దీన్ ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి వారిని అభినందించి మాట్లాడారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఆటల పోటీలలో ప్రతిభను కనపరిచి హాకింపేటలో రాష్ట్ర స్థాయి ఆటలో ఆడారని గుర్తు చేశారు. కోచ్‌ల సమక్షంలో అత్యంత రూప కల్పనలో ఏర్పాటు చేసిన ఈవెంట్స్‌లలో కూడా ఉత్తమ ప్రతిభను కనపరిచి జిల్లాలోనే ఐదు మంది బాలబాలికల్లో దుప్పల్లి గ్రామ భారతి టాలెంట్ స్కూల్ విద్యార్థినీలు ఉండటంఎంతో సంతోషకర మన్నారు. రాష్ట్రంలో హకింపేట, కరీంనగర్, ఆదిలాబాద్ మూడు చోట్ల ఉన్న స్పోర్ట్స్ పాఠశాలలో మన పాఠశాల బాలికలకు హకింపేట స్పోర్ట్స్ స్కూల్‌లో సిట్లు దక్కడం హర్షణీయం అని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది రజియా బేగం, సత్యావతమ్మ, అలివేలు, మమత, తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు సమస్యలను తీర్చాలని ఎఈ, తహసీల్దారుకు వినతి



**పెబ్బేరు అక్టోబర్ 01 ప్రభాతవార్త:** పెబ్బేరు మండలం శాఖాపూర్ గ్రామంలో కరెంటు కోతలు ఎక్కువై కరెంటు ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది నిరంతరం కరెంటు కోతలతో గ్రామ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, శాఖాపూర్ గ్రామానికి కరెంటు కష్టాలు తొలగిపోవాలంటే తోమాలపల్లె సబ్ స్టేషన్ త్వరగా ప్రారంభించి శాఖాపూర్ గ్రామంతో పాటు తోమాలపల్లె, రాంపురం, రామమ్మ పేట, గ్రామాల కరెంటు సమస్యలను తీర్చాలని తహశీల్దార్ కు విద్యుత్ ఏఈ ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శాఖాపూర్ గ్రామ ప్రజలు వి వెంకటన్నగౌడ్, సంద కేశవ్, పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించిన జరీనాబేగం



**లింగాల,అక్టోబరు 01 ప్రభాతవార్త:** సోమవారం వెలువడిన డీఎస్సీ 2023 ఫలితాల్లో మండల కేంద్రా నికి చెందిన జరీనాబేగం ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించింది. నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల కేంద్రానికి చెందిన ఎండి కరీం, అబేదబేగం దంపతుల కుమార్తె జరీనాబబేగం ఒకేసారి రెండు పోస్టులతో సత్తా చాటారు. ఎస్ఎ (స్కూల్ అసిస్టెంట్) ఉర్దులో 54.17 మార్కులతో 2వ ర్యాంక్, యస్జిటి (సెకండరీ గ్రేడ్ టీచర్) ఉర్దూలో 62.73 మార్కులతో 6వ ర్యాంక్ జిల్లాలో సాధించింది. ఎస్ఎ (స్కూల్ అసిస్టెంట్) ఉర్దూ విభాగంలో 2 పోస్టులు ఉండడం, అందులో 2వ ర్యాంక్ ఎస్జీటిలో 16 పోస్టులు ఉండగా అందులో 6వ ర్యాంక్ రావడంతో కుటుంబ సభ్యులు కేక్ కట్ చేసిసంబరాలు జరుపుకున్నారు.

## పరిశుభ్రతతోనే రోగాల నివారణ సాధ్యం



రోడ్లను శుభ్రం చేస్తున్న దృశ్యం

**తెల్కపల్లి,అక్టోబరు 01 ప్రభాతవార్త :** వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతతోనే రోగాల నివారణ సాధ్యమని సిఎల్ఆర్ విద్యా సంస్థ కరస్పాండెంట్ వి.రాజమహెందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా విద్యా సంస్థలో అధ్యాపకులు విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. విద్యా సంస్థ ప్రాంగణంలో గ్రామంలోని రోడ్లకిరువైపులా ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వచ్ఛదానం పచ్చదనాన్ని పెంపొందిస్తూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యా సంస్థ ప్రిన్సిపల్ మర్యాద ప్రకాష్‌రెడ్డి, ఎస్. సందీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బిసిసేన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాకిటి భీమశంకర్ ముదిరాజ్



నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

**కృష్ణ,అక్టోబరు 01 ప్రభాతవార్త:** బిసి సేన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వాకిటి భీమశంకర్ ముదిరాజ్‌ను నియమిస్తూ బిసి దళపతి ఆర్.కృష్ణ, జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందజేశారు. ముదుమాల్ గ్రామానికి చెందిన వాకిటి భీమశంకర్‌ను హైదరాబాద్‌లో రాష్ట్ర బిసి భవనంలో ఆసంఘం నాయకులు సమావేశం నిర్వహించి నియామక పత్రాన్ని అందించినట్లు ఆయన తెలిపారు.తనపై నమ్మకముంచి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియ మించినందుకు రుణపడి ఉంటానని బిసిల సర్వతోముఖాభివృద్ధికి నా వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్ర మంలో జిల్లా అధ్యక్షుడు సేలేటి వెంకటేష్, బురుగుపల్లి కృష్ణ యాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటరాములు పాల్గొన్నారు.

## స్కూల్ అసిస్టెంట్ జాబ్ సాధించిన అభ్యర్థికి ఘన సన్మానం



**పెబ్బేరు అక్టోబర్ 01 ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాల నాగసానిపల్లిలో ఎస్ జి టి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల ప్రకటించిన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో ఉపాధ్యాయులు ఎన్నికైనటువంటి జి ప్రదీప్ కుమార్‌ను పిఆర్‌టి యుటిఎస్ పెబ్బేరు, శ్రీరంగాపురం మండల శాఖ తరపున ఘనంగా సన్మానించడం జరిగింది. కార్యక్రమంలో పెబ్బేరు మండల అధ్యక్ష ప్రధాన కార్య దర్శులు చిన్న రాములు, దుర్గాప్రసాద్ యాదవ్ శ్రీరంగాపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజు, విష్ణువర్ధన్ నాయుడు వనపర్తి జిల్లా పిఆర్‌టి యుటి ఎస్ అసోసియేట్ అధ్యక్షులు జయంతి రెడ్డి, మాజీ అసోసియేట్ అధ్యక్షులు శివశంకర్ యాదవ్, పెబ్బేరు మండల అసోసియేట్ అధ్యక్షులు మహేష్ కుమార్, ఉపాధ్యక్షులు కృష్ణయ్య గౌడ్, కార్యదర్శి రవికుమార్, శ్రీరంగాపురం ఉపాధ్యక్షులు సుధాకర్, ప్రాథమిక సభ్యులు వెంకటేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఘన సన్మానం



**జడ్చర్ల,అక్టోబరు 01 ప్రభాతవార్త :** అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా జడ్చర్ల మున్సి పాలిటీ పరిధిలోని మూడవ వార్డు కల్వకుర్తి రోడ్డులో ఉన్న మహాత్మ జ్యోతి బాపూలే రెసిడెన్షియల్ పాఠశాలలో వార్డు కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్‌కిసన్మాన కార్యక్రమంఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథు లుగా జడ్చర్ల ఎంపిడిఓ విజయ్‌కుమార్, సీనియర్ సిటిజన్స్ బాదేపల్లి ఎఎంసి మాజీ ఛైర్మన్ కాట్రపల్లి లక్ష్మయ్య, సీనియర్ నాయకులు అయ్యన్న, రిటైర్డ్ టీచర్లు నయీముద్దీన్, జమీల, సత్యనారాయణరెడ్డి, ఆశీర్వాదం,వ్యాపారస్తులు మిరియాల వేణుగోపాల్, దత్తు, పాఠశాల ప్రిన్సిపల్ రవిప్రకాష్‌ను శాలువాలు, పూలదండలతోఘనంగాసన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునిలు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి సమస్యను పరిష్కరించండి

■ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ■ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం



ఎమ్మెల్యేను కలిసిన మిషన్ భగీరథ అధికారులు

**గద్వాల, అక్టోబర్1, ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలాలలో తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఆదశాలిచ్చారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మిషన్ భగీరథ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. గత కొద్ది రోజుల నుండి గట్టు మండలంలోని పలు గ్రామాలలో ప్రజలకు తాగునీటి సౌకర్యాం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయము ఎమ్మెల్యే దృష్టికి రావడం జరిగింది. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మిషన్ భగీరథ అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు.ముందుగా గద్వాల మిషన్ భగీరథ నూతన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టిన వెంకటరమణ ఎమ్మెల్యేని శాలువాఆ కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గట్టు మండలంలోని పలు గ్రామాలలో చాలా రోజుల నుంచి సరైన తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మిషన్ భగీరథ ద్వారా నీటి ప్రెజర్ ఎక్కువ కావడంతో సరైననీటి సౌకర్యాం లేకపోవడంతో ప్రజలు తాగునీటికి నీళ్లు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కావున త్వరగా రెండు మూడు రోజుల్లో మరమ్మతులు చేసి మూడో మోటర్ ఆన్ చేసి సమస్యలను పరిష్కరించమని కొత్తగా మూడవ మోటార్‌ను బిగించి ఆన్‌చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని మిషన్ భగీరథ ఎస్‌సికి ఎమ్మెల్యే సూచించారు. మిషన్ భగీరథ అధికారులు సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే చెప్పిన మాట ప్రకారం రెండు మూడు రోజుల్లో మరమ్మత్తులను పూర్తిచేసి కొత్త మోటార్‌నుఏర్పాటు చేసిప్రజలకు నీటి సౌకర్యం కల్పించి భవిష్యత్తులో ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీజెడ్పిటిసి రాజశేఖర్,మిషన్‌భగీరథ ఎస్ఎఈ వెంకట రమణ,ఈఈ గ్రీడ్ పరమేశ్వర్, ఈఈ, ఇంట్రా శ్రీధర్‌రెడ్డి, డిఈఈ రవి చంద్ర, ఐహచ్‌సి ఏజేన్సీ మోహన్ పాల్గొన్నారు.

## కలుషిత మంచినీటి సరఫరా పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలి

■ గ్రామ మంచినీటి సరఫరా సహాయకుల శిక్షణలో మిషన్ భగీరథ డిఈఈ సుదర్శన్



మంచినీటి సహాయకులకు అవగాహన కల్పిస్తున్న డిఇఇ సుదర్శన్

**ఉప్పునుంతల,అక్టోబరు 01 ప్రభాతవార్త:** గ్రామాలలో మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న మంచినీటి వృధాను అరికట్టాలని మిషన్ భగీరథ అచ్చంపేట డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుదర్శన్ అన్నారు. మంగళవారం రైతు వేదికలో ఎంపిడిఓ మోహన్‌లాల్ అధ్యక్షతన జరిగిన ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా మొదటిరోజైన మంగళవారం గ్రామాలలో పని చేస్తున్న మంచినీటి సహాయకులకు జరిగే శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మంచినీటి కలుషితాన్ని నివారించేందుకు గ్రామ సహాయకులు తగిన నైపుణ్యాలను కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. పైపుల లీకేజీ, మంచినీటి సరఫరా చేస్తున్న సమయంలో పైపులు పగిలినప్పుడు తీసుకోవలసిన చర్యలపై మంచినీటి సహాయకులకు ఆయన నైపుణ్యాలను వివరించారు. అదేవిధంగా ట్యాంకులను శుభ్రపరిచే విధానము, మంచినీటిని క్లోరినేషన్ చేసే పద్ధతులను శిక్షణలో వివరించారు. ఎక్కడైనా చేతి పంపులు పాడైనప్పుడు వాటిని రిపేర్ చేసే విధానాన్ని ప్రతి ఒక్కరు నేర్చుకొని ఉండాలని ఆయన సూచించారు. గ్రామాలలో మంచినీటి సరఫరా అత్యంత కీలకమైన విషయమని దీనిపై ఎట్టి పరిస్థితుల్లో అశ్రద్ధ వహించరాదని ఆయన సూచించారు. కలుషిత నీటివల్ల అనేక రోగాలకు గురికావాల్సి వస్తుంది. కలుషిత నీటి పట్ల అప్రమత్తతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. గ్రామాలను మంచినీటి సరఫరా బాధ్యతగా సరఫరా చేయాలని ఆయన కోరారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదన్నారు. కాలనీలకు నీటిని సరఫరా చేసేటప్పుడు సమయపాలన పాటిం చాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి నారాయణ, మిషన్ భగీరథ ఎఇ సాయి, ఆయా గ్రామాల మంచినీటి సహాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు షీటీమ్ పై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం ఎస్సై

**పెబ్బేరు అక్టోబర్ 01 ప్రభాతవార్త :** పెబ్బేర్ పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు, అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది.షీటీమ్స్ ఎస్సై మాట్లాడుతూ, అమ్మాయిలకు సమమాజంలో రకరకాల వ్యక్తుల నుండి అనేక రకాల ఇబ్బం దులు ఎదురవుతాయని మానసిక సమస్యలు,ప్రేమ వ్యవహారాలు,ఒత్తిడి,భయము, బుగులు,సైబర్ నేరాల గురించి, అమ్మాయిలు సమాజంలో ఎదుర్కొంటున్నటువంటి అంశాల పట్ల అవగాహన కలిగించడం జరిగింది. కొత్త వ్యక్తులకు వాట్సాప్ ద్వారా ఫెస్‌బుక్‌లో పరిచయాలు చేసుకోరాదని, ఇంట్లో బేటా బస్టాండులో మీకు ఎమైనా ఇతరుల నుండి ఇబ్బందులు ఎదురైతే షీటీంకు తెలియజేయాలని తెలిపారు. సొసైటీలో చేదువ్యసనాలకు గురయ్యే అంశాలను, మనకు సంబంధించిన వ్యక్తిగత ఫోటోస్, మనకు తెలిసిన తెలియని వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ భద్రాసేన్ మాట్లాడుతూ, విద్యార్థులు సెల్ఫ్ కాన్ఫిడెన్స్ గా ఉండాలని, సమాంలో మన చుట్టూ జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ,ఏ చిన్న సమస్య అమ్మాయిలకు వచ్చిన మీరు షీటీమ్‌కు వెంటనే కాల్ చేయాలని, ఇతరుల నుండి జరిగే పరిణామాలను మన అధ్యాపకులకు,తల్లిదండ్రులకు తెలియజేయాలని , భయాందోళనకు గురికాకుండా ఉండాలని తెలుపుతూ, విద్యార్థులు చక్కగా చదువుకుంటే క్రమశిక్షణ పట్ల సమాజం పట్ల, బాధ్యాతయుతంగా ఉండడం అవవగాహన కలుగుతుందని తెలుపుతూ,ఇప్పుడున్న నేటి ప్రపంచంలో సాంకేతిక టెక్నాలజీలతో వాట్సాప్ ద్వారా ఫేస్‌బుక్ ద్వారా మెసెజ్‌ల ద్వారా అమ్మాయిలకు ట్రాప్ చేయడం జరుగుతుందని వాటిపట్ల మనం జాగ్రత్తగా ఉండాలని విద్యార్థులకు గుర్తించడం జరిగింది. అమ్మాయిలకు సంబంధించి ఎన్నో రకాల చట్టాలు ఉన్నాయని వాటిని, ఇలాంటి షీటీమ్ వారి నుండి, భరోసా టీం వారి నుండి అధ్యాపకుల నుండి, న్యూస్ పేపర్ నుండి, ఎలక్ట్రానిక్ మీడియా తెలుసుకోవాలని తెలుపుతూ, అబ్బాయిలు కూడా సమాజంలో బాధ్యాతయుతంగా నడుచుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులుపిల్లలు ఎలా ఉండాలో గమనిస్తూ ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భద్రసేన్, షీటీమ్ ఎస్సై అంజత్, మరో సెట్టింగ్ శిరీష, వ్యవహారం హెల్ప్‌లైన్ టీం అశోక్ కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ముమ్మరంగా కొనసాగుతున్న బిజెపి సభ్యత్వాలు



ఎర్రవల్లిలో బిజెపి సభ్యత్వ నమోదును అందజేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి

**ఇటిక్యాల అక్టోబర్1 ప్రభాతవార్త:** బిజెపి పార్టీ అధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వాలు మండల పరిధిలోని గ్రామాలలో ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తుండగా ముఖ్య అతిథిగా జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కో కన్వీనర్ పార్టీ ఉపాధ్యక్షులు కేకే రెడ్డి, హజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలువురు యువకులకు బిజెపి సభ్యత్వ నమోదును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా పార్టీ అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి మాట్లాడుతూ నాయకులు గ్రామాలలో ప్రతిపోలింగు బూతులో 200 సభ్యత్వాలు తప్పకుండా చేయించాలని మండల స్థాయిలో 5 వేల సభ్యత్వాలు కచ్చితంగా నమోదు చేయించేందుకు నాయకులు ప్రణాళిక వేసుకోవాలన్నారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ పాలన నచ్చి బిజెపి పార్టీ నుండి యువత ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి సభ్యత్వ నమోదు చేసుకోవడం జరుగుతుందని బిజెపిలో క్రియాశీలక సభ్యత్వం తీసుకోవాలంటే ప్రతి ఒక్కరు 100 సభ్యత్వాలు చేస్తే క్రియాశీల సభ్యులు అవుతారని దేశంలో ఎంతోమంది సభ్యులు బిజెపిపార్టీ సభ్యత్వాన్ని పొందుతున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల కార్యదర్శి నరేశ్, సుధాకర్, దామోదర్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు

**జడ్చర్ల,అక్టోబరు 01 ప్రభాతవార్త:** కొత్త కేశవులు సేవ ట్రస్టు ఆధ్వర్యంలో కొత్త కేశవులు 120వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం బాదేపల్లి జడ్పీహెచ్ఎస్ బాలుర హైస్కూల్లో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిప్యూటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కొత్త కేశవులు ట్రస్టు నిర్వాహకుడు జవహర్‌బాబు, కొత్త కేశవ సేవలను విద్యార్థులకు వివరించారు. స్వాతంత్ర సమరయోధుడు జడ్చర్ల మొట్టమొదటి ఎమ్మెల్యే కొత్త కేశవులు జయంతి సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ నిరూపించుకోవాలన్నారు. విద్యార్థి దశనుండే దేశ నాయకుల చరిత్ర తెలుసుకోవాలని అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో కొత్త కేశవులు విగ్రహంముందు విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయనున్నట్లుతెలిపారు.కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయురాలు చంద్రకళ, ఉపాధ్యాయుల బృందం గోపాల్, శంకర్‌బాబు, పురుషోత్తం, ఇబ్రహీం, సునిల్‌రాయుడు, కొత్త కేశవులు, ట్రస్టు సభ్యులు ప్రకాష్, గోనెల రాధాకృష్ణ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

## పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలి

-నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



శ్రీరామ మిల్క్ పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** మహిళలు వివిధ ప్రథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యాపార రంగంలో రాణించి ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి కోరారు. నాగర్‌కర్నూల్ మండలం పెద్దముద్దునూరు గ్రామంలో గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి, శ్రీరామ మిల్క్ పార్లర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆదుకునేందుకు అనేక రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. డ్వాక్రా రుణాలతో పాటు వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే రుణాలను సద్వినియోగం చేసుకొని గ్రామంలో 10 మందికి ఉపాధి కల్పించడంతో పాటు ఆర్థికంగా కుటుంబాలకు అండగా నిలువాలని అకాంక్షించారు. వ్యాపారంలో రాణించేందుకు మెళుకవలను పాటించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, మాజీఎంపిటీసీ రమణరావు, మాజీ సర్పంచ్ స్వామి, శ్రీకాంత్‌రావు, భగవత్ శ్రీను తదితరులు ఉన్నారు.

## రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి లేకపోవడం దురదృష్టకరం

◆విద్యాశాఖ మంత్రి పదవికి ఏ ఒక్క ఎమ్మెల్యేకు అర్హత లేదా?
◆బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోదిపల్లి శ్రీనివాస్

**నారాయణపేట టౌన్,అక్టోబరు 01 ప్రభాతవార్త:** రాష్ట్రంలో విద్యావ్యవస్థపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఏ మాత్రం సోయిలేదని బీఎస్పీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు బొదిగెలి శ్రీనివాస్ తీవ్ర విమర్శలు చేశారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ ఛిన్నాభిన్నంగా తయారైందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కనీసం విద్యాశాఖకు మంత్రిని కూడా నియమించలేని స్థితిలోముఖ్యమంత్రి ఉండడం సిగ్గుచేటన్నారు.విద్యాశాఖ మంత్రి లేని రాష్ట్రంగా తెలంగాణ ఉండడం అత్యంత దురదృష్టకరమన్నారు.విద్యాశాఖ మంత్రి పదవికి రాష్ట్రంలో ఏ ఒక్క ఎమ్మెల్యేకు అర్హత లేదా? అని ప్రశ్నించారు. తక్షణమే రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రిని నియమించాలని ఆయన డిమాండ్ చేశారు.

## గాంధీ జయంతి రోజు మటన్, చికెన్ విక్రయిస్తే చర్యలు తప్పవు

**నారాయణపేట టౌన్,అక్టోబరు 01 ప్రభాతవార్త :** నేడు గాంధీ జయంతి సందర్భంగా నారాయణపేట పట్టణంలో మటన్, చికెన్, చేపల దుకాణాలు యజమానులు మాంసం విక్రయించరాదని మున్సిపల్ కమిషనర్ సునిత సూచించారు. నిబంధనలు అతిక్రమించి మాంసం, చికెన్, చేపలు విక్రయిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సకాలంలో గ్యాలరీ గదుల నిర్మాణం పూర్తి చేయాలి

**మహబూబ్‌నగర్,అక్టోబరు01 ప్రభాతవార్త :** పాలమూరు యూనివర్సిటీలో సింథటిక్ ట్రాక్‌కోర్టు పరిసర ప్రాంతాలలో గ్యాలరీ గదుల నిర్మాణం రూ. 4.40 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ డా. మధుసూదన్‌రెడ్డి పూజా కార్యక్రమాలు చేసిసకాలంలో గ్యాలరీ గదుల నిర్మాణం పనులను నాణ్యమైనమెటీరియల్ ఉపయోగించి పూర్తి చేయాలని అన్నారు. రిజిస్ట్రార్‌తోపాటు ఆర్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్లు, సూర్య ఉన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతంగా రాణించాలి

**వెల్దండ, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** విద్యార్థులు కష్టపడి చదివి మంచి లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం వెల్దండ మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను రాఘవేందర్‌రెడ్డి సందర్శించి విద్యార్థినులతో మాట్లాడి విద్యార్థినుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యార్థినుల కోసం అనేక వినూత్న కార్యక్రమాలు అమలు చేయడానికి ముందుకు సాగుతుందన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం విద్యార్థుల తల్లిదండ్రులు ముందుకు రావాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ జానకి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, ఐక్యతఫౌండేషన్ సభ్యులురమేష్‌నాయక్, మల్లేష్, శ్రీనునాయక్, లక్ష్మణ్‌నాయక్, జయరాంనాయక్, రాహుల్ ఉన్నారు.

## దేవీ శరన్నవరాత్రి ఉత్సవ పుస్తకావిష్కరణ

**కల్వకుర్తి, అక్టోబర్01 ప్రభాతవార్త:** శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవీ దేవాలయంలో ఈ నెల 3 నుంచి 13వ తేదీ వరకు దేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్ బాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంప శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించనున్నారు. 10 రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలకు సహకరించే దాతల కార్యక్రమాల వివరాలను పుస్తకంలో పొందుపరిచామన్నారు. మంగళవారం ఉదయం దేవాలయ ఆవరణలో ఆలయ ఫౌండర్ ట్రస్టీ జూలూరి రమేష్‌బాబు,ఉత్సవ కమిటీ అధ్యక్షులు గంపశ్రీనివాసులు ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు నారాయణరాజు, దాచేపల్లి నితిన్‌కుమార్, కోశాధికారులు పానుగంటి నవీన్, సంబు తరుణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శి వాస మనీష్,ఉత్సవ కమిటీ ముఖ్యసలహాదారులు దాచేపల్లి శ్రీనివాసులు,గందం ప్రసాద్, సంబుముత్యాలు, వాస శేఖర్, జూలూరి వీరేష్, దుగ్గి వెంకటేష్, కంది ప్రవీణ్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్, కొండూర్ కృష్ణయ్య, గుగ్గిళ్ళ శంకర్, పోల సురేందర్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవం

**కల్వకుర్తి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమం (డిడబ్ల్యూఓ పీబీఎస్ కో మేనేజ్‌మెంట్)లో మంగళవారం ప్రపంచ వయో వృద్దుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్‌నుకట్ చేసి వృద్ధులకు వృద్ధాశ్రమ నిర్వాహకులకు పీబీఎస్ అధ్యక్షులు పి.వెంకటయ్య పండ్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృద్ధులను గౌరవించాలని, వారి హక్కులకు భంగం కల్పించకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హోంకోఆర్డినేటర్ వి.పద్మమ్మ,ఎం.పరమేష్, సిబ్బంది శ్రీనివాస్, సునంద, కవిత, వృద్ధులు తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** తిమ్మాజిపేట మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పరామర్శించారు. మంగళవారం తిమ్మాజిపేటలోని వట్టెపు శేఖర్ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పరామర్శించి ఓదార్చారు. అదే విధంగా కాలుకు ఆపరేషన్ చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ సర్పంచ్ మురళీధర్‌రెడ్డిని, గుమ్మకొండలో గాలయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను,అప్పాజీపల్లిలో బీఆర్ఎస్ కార్యకర్త సురేందర్‌రెడ్డి తండ్రి మృతి చెందడంతోమృతుడి కుటుంబ సభ్యులను వేర్వేరుగా పరామర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట పార్టీ మండల అధ్యక్షులు జోగు ప్రదీప్, మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్ గౌడ్,నాయకులు వెంకటస్వామి, మాజీ ఎంపీటీసీ మల్లయ్య, వెంకటేష్, బాల్‌రెడ్డి, చిన్నయ్య తదితరులు ఉన్నారు.

## ఆకట్టుకుంటున్న వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 01 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 17నుండి అక్టోబర్ 2వరకు స్వచ్ఛతా హి సేవ 2024 పక్షోత్సవాల్లో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఆర్‌డిఓ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖలు వేస్ట్ టు ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ నవాబ్‌పేటపంచాయతీరాజ్‌శాఖ,దేవరకద్ర మండల ప్రాథమికోన్నత పాఠశాల, పెద్దరాజమూరు జడ్పీహెచ్ఎస్ ధర్మాపూర్, జిపి మంగలిగడ్డ తండా, మిడ్జిల్ మండలం, బూరుగుపల్లి, కోయిల్‌కొండ మండలం, రాజాపూర్ పంచాయతీ కార్యదర్శులు వ్యర్థవస్తువుల నుండి వస్తువులు,అలంకరణ తయారీ ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులు,ఐసిడిఎస్, పాఠశాలలపిల్లలకు వారికి సర్టిఫికెట్‌లను జిల్లా కలెక్టర్ విజయేందిరబోయి ప్రధానం చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డిఆర్‌డిఓ నర్సింహులు పాల్గొన్నారు.

# ఘనంగా బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ సంబరాలలో ఎమ్మెల్యే పర్ణికరెడ్డి

**కల్వకుర్తి, అక్టోబర్ 1 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శార్వణి ఆధ్వర్యంలో విద్యార్థులు బతుకమ్మను తీరొక్క పూలతో పేర్చి బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. దసరా పండుగను పురస్కరించుకొని గౌరమ్మను భక్తి శ్రద్ధలతో పూజించారు. విద్యార్థులుచేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాణి, మహిళా సాధికారిత కోఆర్డినేటర్ శ్రీమతిభాయి, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

**నారాయణపేట టౌన్, అక్టోబరు 1 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అని ఎమ్మెల్యే పర్ణికరెడ్డి అన్నారు. మంగళవారం చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండగ అన్నారు. ప్రకృతి ఆరాధించే పెద్ద పండగ బతుకమ్మ పండగ అన్నారు. బతుకమ్మ పండగను దశాబ్దాలుగా జరుపుకుంటున్నారన్నారు. తెలంగాణ వాసుల బతుకమ్మ పండగ పూలు బాగా వికసించే కాలంలో జన వనరులు సమృద్ధిగా పొంగిపొర్లే సమయంలో బతుకమ్మ వచ్చి భూమితో,జలంతో మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడుతుందన్నారు.ఆడపడుచుల పెద్ద పండగ బతుకమ్మ పండగ అన్నారు. విద్యార్థులలో కలసి ఎమ్మెల్యేఆడి పాడారు. కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

**అక్షయరెడ్డి టెక్నో ప్లే స్కూల్‌లో:** అక్షయరెడ్డి టెక్నో ప్లే స్కూల్‌లో సాంప్రదాయ దుస్తులతో విద్యార్థినీ, విద్యార్థులు రంగు, రంగుల పసుపు, ఎరువు, ఆకుపచ్చ, తంగిడి పూలతోబతుకమ్మను తయారు చేసి స్కూల్‌లో విద్యార్థినీ, విద్యార్థులు ఆటపాటలతో , బొడ్డెమ్మలతో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు.కార్యక్రమంలో డైరెక్టర్ అక్షయరెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, పాఠశాల ఇంఛార్జి రమ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**చిన్నచింతకుంట, అక్టోబరు1 ప్రభాతవార్త:** మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో నేటి నుంచి దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. మంగళవారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలను విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు అందంగా అలంకరించిన బతుకమ్మల ముందు బతుకమ్మ పాటలతో బొడ్డెమ్మలు వేస్తూ సంబరాలు జరుపుకున్నారు. లాల్‌కోట చౌరస్తాలోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను అలంకరించి బతుకమ్మ బొడ్డెమ్మలతో విద్యార్థులు సంబరాలను జరుపుకున్నారు.

**బిజినపల్లి, అక్టోబరు1 ప్రభాతవార్త:** ప్రాథమికోన్నత పాఠశాల కారుకొండలో మంగళవారం ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఉపాధ్యాయులు ఇంద్రాణి, చైతన్య, భాగ్యలక్ష్మి, లావణ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

**లింగాల, అక్టోబరు 1 ప్రభాతవార్త :** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు



బతుకమ్మ సంబరాలలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు





బతుకమ్మ సంబరాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉట్టిపడేలా మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ విద్యాలయం తదితర పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది కలలిసి బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.విద్యార్థులు, ఉపాధ్యా యులు ఒకచోట చేరి బతుకమ్మ సంబరాలు జరుపు కున్నారు. అనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మ లను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఇంఛార్జి హెచ్ఎం కొండ య్య, కస్తూర్బా గాంధీ విద్యాలయం ఎస్ఓ శారద, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటి ఛైర్మన్ మంగమ్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయిులు శంకరయ్య, పురుషోత్తం, విజయ్‌కుమార్, నరసింహ, శేఖర్,శర్మ, రమేష్, రామచంద్ర, ధర్మసింగ్, వసంత్, యాదమ్మ, శశికళ, చంద్రకళ,మహేశ్వరి, సమీరా, కవితరాణి, సుజాత, పరహన, పాల్గొన్నారు.

**ఉప్పునుంతల, అక్టోబరు 1 ప్రభాతవార్త :** మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలకు సెలవు దినాలు రావడంతో ముందస్తుగా బతుకమ్మ సంబరాలు మంగళవారం నిర్వహించారు. ఉప్పునుంతల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తెలంగాణ పూల పండగ బతుకమ్మ సంబరాలు పాఠశాల హెచ్ఎం జటప్రోలు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాలు కన్నుల పండువగా జరిగింది. కార్యక్రమంలో హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు సత్యనారాయణ, పోకల సతీష్, శ్యాంసుందర్‌గౌడ్, మహిళా ఉపాధ్యాయిులు కల్పన, శ్యామల గౌరీ, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

**మైల్‌స్టోన్ స్కూల్‌లో:** మండల కేంద్రమైన ఉప్పునుంతలలో మైల్‌స్టోన్ స్కూల్లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సంబరాలలో పాఠశాల కరస్పాం డెంట్ ఉన్నికష్ణన్, పొన్నగంటి దేవేందర్‌రెడ్డి, ఏడు కొండలు, పొన్నగంటి నాగరాణి, మహిళా ఉపాధ్యా యురాలు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

**కృష్ణ, అక్టోబరు01 ప్రభాతవార్త:** ముడుమాల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినిలు మంగళవారం బతు కమ్మ సంబరాలు జరుపుకున్నారు. మండల విద్యాదికారి నిజాముద్దిన్, ఉపాధ్యాయ బృందంజనార్ధన్‌రెడ్డి, పిఆర్‌టియుప్రధానఅధ్యక్షులుకురుమయ్య, మాధవి, శ్రీనివాసులు, గాయత్రి, మీనా కుమారి, కల్మోద్దిన్, సదానంద్, సురేష్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



బతుకమ్మ సంబరాలలో విద్యార్థినిలు, ఉపాధ్యాయులు

**మక్తల్, అక్టోబరు 1 ప్రభాతవార్త :** మండలంలోని కాచ్‌వార్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, ఉపాధ్యాయురాలు అనిత, అంగన్‌వాడి టీచర్లు నవీన, లక్ష్మి ఆయాలు కొండమ్మ, యశోద, మంజుల విద్యార్థులు పాల్గొన్నారు.

**గద్వాల అక్టోబర్ 1 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల గద్వాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి ముఖ్యఅతిథిగా విచ్చేయగా వారిని పాఠశాల యన్.సి.సి విద్యార్థుల కవాతు మధ్యన వేదిక మీదకు ఆహ్వానించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వెంకట్ నర్సయ్య, పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. బతుకమ్మ సంబరాల్లో భాగంగా విద్యార్థులతో ఉపాధ్యాయులతో జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి కవితా దేవి బతుకమ్మ ఆటపాటల్లో పాల్గొని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీనియర్ ఉపాధ్యాయులు బి.విష్ణు, యువతి, హెమావతి, సునీత బాయి, సౌమ్య దేవి,కవిత, శివ ప్రియా,రాధిక, కృష్ణ,సవారన్న, నాగరాజు, మహేందర్, రహిమత్, రాజు, జానకి, రాముడు, యన్.సి.సి ఉపాధ్యాయుడు రాముడు,రాధాకృష్ణారెడ్డి,ప్రశాంత్,కేశవ్,దౌలత్,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

**పెబ్బేరు అక్టోబర్ 1 ప్రభాతవార్త :** పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్స్ పాఠశాలలో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రంగు, రంగు పూలను పేర్చి వాటి మధ్యలో పసుపుతో తయారుచేసిన గౌరమ్మను ఉంచినటువంటి బతుకమ్మ వేడుకను పాఠశాల కరస్పాండెంట్ లావణ్య రంగారెడ్డి ఘనంగా ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రావు ఉపాధ్యాయుల బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

**ఇటిక్యాల అక్టోబర్ 1 ప్రభాతవార్త:** బతుకమ్మ పండుగ సంబరాలలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గల సరస్వతి టెక్నో పాఠశాలలో రకరకాల పూలతో బతుకమ్మలను అలంకరించి పేర్చారు. అలాగే బతుకమ్మ పాటలతో నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చేస్తు అందరిని అలరించారు.మండల పరిధిలోని ఇటిక్యాల చాగా పురం, వల్లూరు తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో కూడా విద్యార్థినిలు ఉపాధ్యాయులు కలిసి ఘనంగా బతుకమ్మ సంబరాలను జరుపుకున్నారు.













## జైపాల్ కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు

**బిజినపల్లి, అక్టోబరు 01 ప్రభాతవార్త :** అనారోగ్యంతో మృతి చెందిన అప్పాలి జైపాల్ యాదవ్ కుటుంబ సభ్యులను వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు మృతుని కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు.మంగునూరు గ్రామంలో అప్పల జైపాల్‌యాదవ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర యాదవ సంఘం నాయకుడు బైకాని శ్రీనివాస్ యాదవ్, జిల్లా ఎంపిటిసిల సంఘం మాజీ అధ్యక్షుడు మంగి విజయ్, జిల్లా మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ గంగనమోని కురుమయ్య, జైపాల్ యాదవ్ మరణం తీరని లోటని విచారం వ్యక్తం చేశారు.బాధిత కుటుంబానికి అన్ని విధాలాఅండగా ఉంటామని భరోసా కల్పించారు. వారి వెంట మాజీ ఎంపిటిసిలు అప్పాల మనోహర్ యాదవ్, వేముల తిరుపతయ్య, మాజీ మండల కోఆప్షన్ మెంబర్ జహంగీర్, పిఎసిఎస్ డైరెక్టర్ కదిరె నరసింహారెడ్డి, ఎల్లయ్య ఉన్నారు.

## సమీక్ష సమావేశంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర, అక్టోబరు 01 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం జరిగిన ఏపీఎం, సీసీల సమీక్ష సమావేశంలో దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం దేవరకద్ర పట్టణ వ్యాపారులు, స్థానిక నాయకులతో కూడా ఎమ్మెల్యే సమావేశమై పలు విషయాలపై చర్చించారు. అలాగే దేవరకద్రలో అనారోగ్యంతో బాధపడుతున్న నరేందర్‌గౌడ్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉత్కంఠ భరితంగా సూర్యలత స్పిన్నింగ్ మిల్ ఎన్నికల ఫలితాలు

**-68 ఓటర్ల మెజార్టీతో మజ్దూర్ సంఘ్ అభ్యర్థి సూర్యప్రకాష్‌రావు విజయం**



మజ్దూర్ సంఘ్ అభ్యర్థి అయినేని సూర్యప్రకాష్‌రావు

**కల్వకుర్తి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలంలోని మార్చాల గ్రామ సమీపంలోని సత్య సాయినగర్ కాలనీలోని సూర్యలత స్పిన్నింగ్ మిల్‌లో మంగళవారం నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మజ్దూర్ సంఘ్ అభ్యర్థి అయినేని సూర్యప్రకాష్‌రావు ఐఎన్‌టీసీ కాంగ్రెస్‌పార్టీ మద్దతు అభ్యర్థి బృంగి ఆనంద్‌కుమార్ మధ్య గట్టి పోటీ కొనసాగింది. మొత్తం 450 ఓట్లకు గాను 11 మంది ఓరిస్సాకు చెందిన వారు ఓరిస్సాకు వెళ్లారు. 450కు గాను 439ఓట్లు పోలయ్యాయి. 251 ఓట్లు సూర్యప్రకాష్‌రావుకు పోలు కాగా, ఆనంద్ కుమార్ 183 ఓట్లు, 4 ఓట్లు చెల్లుబాటు కాలేదని, 68 ఓట్ల మెజార్టీతో ఐఎన్‌టీసీ కాంగ్రెస్‌పార్టీ మద్దతు అభ్యర్థి బృంగి ఆనంద్‌కుమార్‌పై మజ్దూర్ సంఘ్ అభ్యర్థి అయినేని సూర్యప్రకాష్‌రావు గెలుపొందారని ఉమ్మడి జిల్లా కార్మికశాఖ ఎన్నికల అధికారి చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో కార్మికశాఖ అధికారులు డీఎస్‌స్వామి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మహేష్‌కుమార్, ప్రిసైడింగ్ అధికారి మహేందర్, రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

## విజయోత్సవ ర్యాలీలో మాజీ ఎమ్మెల్యే



బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మజ్దూర్ సంఘ్ అభ్యర్థి అయినేని సూర్యప్రకాష్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే

**కల్వకుర్తి, అక్టోబర్ 01 ప్రభాతవార్త:** కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో గెలుపొదిన బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో మజ్దూర్ సంఘ్ అభ్యర్థి అయినేని సూర్యప్రకాష్‌రావు బృంగి ఆనంద్ కుమార్‌పై గెలుపొందడంతో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, మున్సిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ ఛైర్మన్ రాచోటి శ్రీశైలంలు పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీకి వ్యతిరేకత ఈ ఎన్నికల నుంచే ప్రారంభమైందన్నారు. ఇచ్చిన హామీలు అమలుచేయకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు కోపంగా ఉన్నారని ఆయన మండిపడ్డారు. సూర్యలత స్పిన్నింగ్ మిల్ నుంచి కల్వకుర్తి పట్టణం వరకు భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. విజయోత్సవర్యాలీలో మార్చాల, జిల్లెల్ల, యంగంపల్లి, రాచూర్, కుర్మిద్ద గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని బాణసంచా పేల్చి సంబురాలు నిర్వహించారు.

## మక్తల్ కర్ని బిటి రోడ్డుకు మరమ్మతు

**మక్తల్, అక్టోబరు 01 ప్రభాతవార్త :** పట్టణం నుండి మండలంలోని కర్ని గ్రామానికి వెళ్లే బిటి రోడ్డు గత కొంతకాలంగా పూర్తిగా దెబ్బతిని గోతుల మయంగా మారింది. కర్ని పెద్ద చెరువు, మక్తల్ తిరుమలయ్య చెరువు వద్ద రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని బిజెపి మండల అధ్యక్షుడు చిట్యాల లక్ష్మణ్ మంగళవారం టిప్పర్ల సహాయంతో మట్టిని వేసి మరమ్మతులు చేయించారు. దీంతో పలువురు వాహనదారులు, ప్రయాణీకులు ధన్యవాదాలు తెలిపారు.

## ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

◆ ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శ్రీధర్‌రావు ◆ గ్రామ మంచినీటి సహాయకుల 4 రోజుల శిక్షణ శిబిరం ప్రారంభం

**కల్వకుర్తి, అక్టోబర్01 ప్రభాతవార్త:** కల్వకుర్తి, ఊర్కొండ మండలాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శ్రీధర్‌రావు సూచించారు. గ్రామ మంచినీటి సహాయకులకు 4 రోజుల శిక్షణ తరగతుల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కల్వకుర్తి పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమాలకు ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శ్రీధర్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంచినీటి సరఫరాలో గ్రామ మంచినీటి సహాయకులు అవగాహన కలిగి ఉండాలని దిశా నిర్దేశం చేశారు. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మిషన్ భగీరథ ద్వారా అన్ని గ్రామాలకు ఇంటింటికి ప్రతి రోజు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడుతాయన్నారు. ప్రతి రోజు గ్రామాల్లో నీటిని సకాలంలో సక్రమంగా ఎలాంటి ఇబ్బందులుకలుగకుండా అందించడంలో గ్రామ మంచి నీటి సహాయకుల పాత్ర కీలకమన్నారు. నీటి నాణ్యత పరీక్షలు, క్లోరినేషన్,చేతి పంపుల వాడకం, పైపులైన్ మరమ్మత్తుల నిర్వహణపై అవగాహన కల్పించడానికి ప్రతి రోజు ఒక అంశంపై



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ఈఈ శ్రీధర్‌రావు

శిక్షణ ఇచ్చే శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాన్ని సాధించాలన్నారు. తొలి రోజు నీటి నాణ్యత పరీక్షలు క్లోరినేషన్‌పై నీటి నాణ్యత జిల్లా మాస్టర్ ట్రైనర్ రమేష్ అవగాహన కల్పించారు. ఆర్ఓ వాటర్ కన్న మిషన్ భగీరథ వాటర్ మిన్న అని ప్రయోగత్మాకంగా ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరాములు, ఆర్‌డబ్ల్యూఎస్‌డీఈ సంధ్యారాణి, వాటర్‌గ్రిడ్ డీఈమణిపాల్, ఇన్‌ఫ్రా ఏఈ అకాష్, ఏఈ సంతోష్, మైక్రో బయలాజిస్ట్ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

## పాలెం చెరువులో ఉపాధి కల్పించండి

**బిజినపల్లి, అక్టోబరు 01 ప్రభాతవార్త :** పాలెం పెంటోనిచెరువులో మత్స్యకారులుగా సభ్యత్వం కల్పించి ఉపాధి చూపాలని గుడ్లనర్వ గ్రామానికి చెందిన ముత్తరాశి కులస్తులు జిల్లా ఫిషరీస్ అధికారులను, పాలెం మత్స్యకార సహకార సంఘం సభ్యులకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పెంటోనిచెరువు కట్ట మైసమ్మ ఆలయం వద్ద మంగళవారం గుడ్లనర్వ గ్రామానికి చెందిన మత్స్యకార కుటుంబీకులు సమావేశమయ్యారు. తమ గ్రామ పరిధిలో 79 ఎకరాల చెరువు శిఖం ఉందని అందులో తమకు చేపల వేటకు అనుమతి ఇవ్వాలని జిల్లా ఫిషరీస్ అధికారులకు, పాలెం మత్స్యకార సహకార సంఘానికి విన్నవించారు. క్షేత్రస్థాయిలో ఇరు వర్గాల అభిప్రాయ సేకరణకు వచ్చిన ఫిషరీస్ శాఖ అధికారులు వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. 1976 నుంచి పాలెం గ్రామంలోని పెంటోని చెరువు కేవలం పాలెం గ్రామంలోని మత్స్యకార కుటుంబాలకు మాత్రమే హక్కు ఉందని, కొత్తగా ఇప్పుడు గుడ్లనర్వ గ్రామస్తులకు భాగస్వామ్యం కల్పించడం అంటే అధికారుల ముందు ససేమిరా అన్నారు. గ్రామ శివారులో ఉన్న శిఖం భూమి విస్తీర్ణంలో ఎంత మందికి అవకాశం ఉంటే అంతమందికి భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎప్పటి నుంచో తమ గ్రామస్తులకు భాగస్వామ్యం కల్పించకుండా అన్యాయం చేస్తున్నారని న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని గుడ్లనర్వ మత్స్యకారులు అన్నారు.



మత్స్యకారుల అభిప్రాయాలను వింటున్న ఫిషరీస్ శాఖ అధికారులు

ఇరువర్గాల వాదనలు విన్న ఫిషరీస్ శాఖ అధికారి గంగారం మాట్లాడుతూ ఇరువురి వాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.అప్పటివరకు ఇరు గ్రామాల మత్స్యకారులు శాంతియుతంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో గుడ్లనర్వ గ్రామ మాజీ సర్పంచ్‌లు మల్లికార్జున్ నాయక్, సురభి మహేష్‌రావు, గుడ్లనర్వ మత్స్యకార సొసైటీ సభ్యులు జి.శ్రీనివాసులు, జంగయ్య, సాయిబాబ, పదుమ తిరుపతయ్య, గూడ కాశన్న, బీమని మహేష్, బీమని రాజు, కాశమోని నరసింహ, పాలెం మత్స్యకార సొసైటీ సభ్యులు కొంకలి నిరంజన్, సొప్పరి బాలస్వామి, కొంకలి యాదగిరి, సొప్పరి కాశన్న, బాలస్వామి, మల్లేష్, దొంతనమోని కృష్ణ, జంగం కృష్ణయ్య, రామకృష్ణ, కొంకలి లోకేష్ తదితరులు ఉన్నారు.

## ప్రజా మన్నన పొందినప్పుడే ఉద్యోగికి సంతృప్తి

**చిన్నచింతకుంట, అక్టోబరు 01 ప్రభాతవార్త :** ప్రభుత్వ ఉద్యోగి ప్రజా మన్నన పొందినప్పుడే సంతృప్తికరంగా ఉంటుందని బదిలీపై వెళ్లిన ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆత్మీయ వీడ్కోలు, ఆహ్వాన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పనిసరని, ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, ఆ వృత్తికి వన్నె తెచ్చేలా పని చేశానని భావిస్తున్నానని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో ఏ ఉపాధ్యాయుని బాధించిఉంటే క్షమించాలని ఆయన కోరారు. గత 19 సంవత్సరాలుగా మండల విద్యాధికారిగా పని చేస్తూ మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేశానని ఆయన తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పని చేస్తూ ఇటు ఉపాధ్యాయులు, అటు ప్రజల మన్నన పొందడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలిపారు. మండలానికి నూతన ఎంఈఓ మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ మండలానికి నూతన ఎంఈఓగా నియమించారని మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయిులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.

## సబ్సిడీ గ్యాస్ ప్రొసిడింగ్ పత్రాల పంపిణీ



**అయిజ అక్టోబర్ 01 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథ కంలో భాగంగా మహిళలకు ప్రతి గ్యాస్ సిలిండర్‌పై 500 సబ్సిడీ రూపాయలను ఇవ్వడం జరుగుతుంది. ఇట్టి పథకంలోభాగంగా మంగళవారం పట్టణంలోని 19వ వార్డు 11వ వార్డుల లబ్ధిదారులకు పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి,పట్టణ అధ్యక్షులు అడ్వకేట్ మధు కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివుడు,జిల్లా ప్రధాన కార్యదర్శి హను మన్న,పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు ఉప్పరి బసవరాజు, ఉపాధ్యక్షులు కృష్ణారెడ్డి,బీసీ సెల్‌జిల్లాప్రధాన కార్యదర్శి మధు,మైనార్టీ సెల్ అధ్యక్షుడు శాలి, ఫైల్ మాన్ తెలుగు బీసన్న,భీమన్న,తెలుగు రాముడు,చిన్నకృష్ణ,భీమయ్య, చారి పాల్గొన్నారు.

## ఛైర్మన్‌ను సత్కరించిన మాజీ జెడ్పి ఛైర్మన్

**గద్వాల అక్టోబర్ 1 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ సరిత క్యాంప్ కార్యాలయంలో నందు నూతన జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మన్ నియామకమైన నీలి శ్రీనివాసులు జెడ్పి మాజీ ఛైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ గద్వాల నియోజకవర్గం ఇంచార్జీ సరిత తిరుపతయ్యను మర్యాదపూర్వకంగా కలిపి శాలువా కప్పి పుష్ప గుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన గ్రంథాలయ ఛైర్మన్ నీలి శ్రీనివాసులు ను సరిత తిరుపతయ్య దంపతులు సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి షేక్షావలీ ఆచారి, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ సీసాలు వెంకట్ రెడ్డి, అల్వాల రాజశేఖర రెడ్డి, శెట్టి ఆత్మకూరు లక్ష్మణ్, రామకృష్ణ, ఆనంద్ గౌడ్, కుర్వ శ్రీనివాసులు, ఆర్డీఎస్ మాజీ ఛైర్మన్ సీతారాం రెడ్డి, గోపాల్ వర్మ, పెదొడ్డి రామకృష్ణ, రామచంద్ర, కొండ వల్ల ఈశ్వర్, వీరన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సిలిండర్ ప్రొసీడింగ్ కాపీలు అందజేత



ధృవీకరణ పత్రాలు అందజేస్తున్న దృశ్యం

**మూసాపేట, అక్టోబరు 01 ప్రభాతవార్త:** మండల చక్రాపూర్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ. 500లకే గ్యాస్ సిలిండర్ పథకం నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం లబ్దిదారులకు మండల ఎంపిఓ అనురాధ అంగన్‌వాడి స్పెషల్ ఆఫీసర్ కమలాదేవి, మత్స్య శాఖ జిల్లా ఆఫీసర్ రోషిణి, గ్రామ కార్యదర్శికార్తీక్, గ్రామకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీ నారాయణ, స్థానిక నాయకులతో కలిసి ధృవీకరణ పత్రాలను గ్రామ ప్రజలకు అందజేశారు.ఈ సందర్భంగా ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ రూ. 500లకే సిలిండర్ హామీ ఇవ్వడం జరిగిందని, ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అక్క, చెల్లెమ్మలకు రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నామని మహిళలకు ఇప్పటికే ఉచిత బస్ సౌకర్యం గెలిచిన రెండు రోజులకే అమలు చేయడం జరిగిందని, 200ల యూనిట్ల ఉచిత విద్యుత్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, తదితర హామీలు నెరవేర్చిన రాష్ట్ర సీఎంరేవంత్‌రెడ్డికి ప్రజలు ఎప్పుడు రుణపడిఉంటారని అన్నారు.కార్యక్రమంలో గ్రామ యూత్ అధ్యక్షుడు గంటల బ్రహ్మయ్య, గ్రామ పెద్దలు లక్ష్మారెడ్డి, గంటల చిన్న సాయన్న,అంగన్‌వాడి టీచర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన గ్రంథాలయ ఛైర్మన్‌ను అభినందించిన మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్

**నారాయణపేట టౌన్, అక్టోబరు 01 ప్రభాతవార్త:** జిల్లా నూతన గ్రంథాలయ ఛైర్మన్‌గా ఎన్నికైన వార్ల విజయ్‌కుమార్‌ను మంగళవారం పేట సివిఆర్ భవన్‌లో మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బండి వేణుగోపాల్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ రాహుల్ జూడో యాత్రతో జోడి కట్టి, మాజీ డిసిసి అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి నాయకత్వంలో కలిసి పని చేసిన నూతన జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ వార్ల విజయ్ కుమార్, బండి వేణుగోపాల్ ఒకరినొకరు గత కార్యక్రమాలను గుర్తు చేసుకుంటూతగిన గుర్తింపును అందుకున్న విజయ్‌కుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.వారితో పాటు మార్కెట్ కమిటి ఛైర్మన్ సదాశివరెడ్డి, వైస్ ఛైర్మన్ కోనంగేరి హన్మంతు తదితరులు ఉన్నారు.



నూతన గ్రంథాలయ ఛైర్మన్‌ను అభినందిస్తున్న దృశ్యం